మంగళవారం
28-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 274
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఖతిన్ హత్యాకాండకు 80 ఏళ్లు

నాజీలు, ఉక్రేనియన్ ఫాసిస్ట్‌లు బెలారష్యన్ గ్రామమైన ఖతిన్‌లో జరిపిన హత్యాకాండ జరిగి 80 సంవత్సరాలు గడిచాయి. అప్పటి ఈ దారుణ మారణకాండలో 75 మంది చిన్నారులు సహా 149 మంది దారుణ హత్యకు గురయ్యారు.

2లో

ఎత్తు తగ్గింపును సహించం

- పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం కుట్రలు సాగనివ్వం
- రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ దీక్షలు
- అంగుళం తగ్గినా నిర్వాసితులకు ద్రోహం చేసినట్లే
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా పూర్తి స్థాయి నిర్మాణాన్ని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట సామూహిక దీక్షలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద జిల్లా సీపీఐ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన సోమ, మంగళవారాలలో జరిగే సామూహిక దీక్షలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్ల నుండి 41.5 మీటర్లకు కుదించడం, నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా ఎగ్గొట్ట డానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని విమర్శించారు. 150 అడుగుల ఎత్తులో 196 టీఎంసీల సామర్థ్యంతో ఉండాల్సిన ప్రాజెక్టును 130 అడుగులకు కుదించి ఆ లోపున ఉన్న నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పడమంటే పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ద్రోహం చేయడమేనని మండిపడ్డారు. పోలవరం పూర్తి అయితే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, కృష్ణా డెల్టాతో పాటు రాయలసీమ ప్రాంతానికి కూడా సాగునీరు అందుతుందన్నారు. తద్వారా రాష్ట్రం సస్యశ్యామలమవుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇటీవల అసెంబ్లీలో పోలవరాన్ని తన తండ్రి ప్రారంభించారని, దానిని తానే పూర్తి చేస్తానని మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీసేలా కేంద్రం ఎత్తు తగ్గిస్తుంటే ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. జగన్ ఎన్నికల ప్రచార సమయంలో తనకు 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి విభజన హామీలు నెరవేర్చేటట్లు చేస్తానని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన తర్వాత జగన్ రాష్ట్ర అభివృద్ధి కోసం ఆలోచన చేయకుండా ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ప్రధాని మోదీ వద్ద తన కేసుల మాఫీ కోసం మోకరిల్లుతున్నారని ఆరోపించారు. ఇకనైనా ముఖ్యమంత్రి తన అహాన్ని పక్కన పెట్టి అన్ని రాజకీయ పార్టీలను ఢిల్లీ తీసుకువెళ్లి కేంద్రంపై ఒత్తిడి చేసే విధంగా చర్యలు చేపట్టాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ, సీపీఎం నేతల బృందంతో ప్రాజెక్టు నిర్వాసిత

- మిగతా 2 లో

ఏలూరు కలెక్టరేట్ వద్ద దీక్షలో రామకృష్ణ, అక్కినేని వనజ, దేగా ప్రభాకర్, కృష్ణ చైతన్య, బండి వెంకటేశ్వరరావు, చలసాని రామారావు తదితరులు

నరసరావుపేటలో దీక్షా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ముప్పాళ్ల, పక్కన మారుతి ప్రసాద్, హుస్సేన్, రాంబాబు తదితరులు

విశాఖ గాంధీ విగ్రహం వద్ద జేవీఎస్ఎన్ మూర్తి, పైడిరాజు, విమల తదితరుల నాయకత్వంలో ధర్నా

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న జల్లి విల్సన్, సీహెచ్ కోటేశ్వరరావు, జి.కోటేశ్వరరావు తదితరులు

దర్యాప్తు ఇంకెంతకాలం?

- విచారణాధికారిని మార్చండి
- వివేకా హత్య కేసుపై సుప్రీం మళ్లీ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును ఇంకెంతకాలం కొనసాగిస్తారని సీబీఐ అధికారులపై సుప్రీంకోర్టు ఆగ్రహం వెలిబుచ్చింది. ఈ కేసులో ఇంతవరకు ఎలాంటి పురోగతి కనిపిం చడం లేదని తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. హత్యకు గల ప్రధాన కారణాలు, ఉద్దేశాలను బయట పెట్టాలని, ఇందుకోసం విచార ణాధికారిని మార్చడమో... మరో అధికారిని నియమించడమో చేయాలని ఆదేశించింది. వివేక హత్యకేసు దర్యాప్తు చేస్తున్న అధికారిని మార్చాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది.

దర్యాప్తు వేగంగా సాగటం లేదని, ఈ కేసును విచారించే అధికారులను మార్చాలని కోరుతూ ఈ కేసులో ఐదో నిందితుడు శివశంకర్ రెడ్డి భార్య తులశమ్మ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ నిర్వహించిన సర్వోన్నత న్యాయ స్థానం... వివేక హత్య కేసును ఇంకెంత కాలం విచారణ చేస్తారని ప్రశ్నించింది. కేసు ఆసాంతం రాజకీయ దురుద్దేశంతో కూడినదేనని రిపోర్ట్‌లో రాశారని జస్టిస్ ఎంఆర్ షా పేర్కొన్నారు. అయితే చెప్పిందే చెపుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దోషులను పట్టుకునేందుకు మీరు చెప్పే ఈ కారణాలు సరిపోవు. 2021నుంచి ఈ కేసులో ఎలాంటి పురోగతి కానరా వడం లేదు. ఇంకా ఎన్ని సంవత్సరాలు కావాలి? ప్రస్తుత సీబీఐ అధికారి తీరును చూస్తే ఈ కేసును ఇప్పట్లో ముగించే పరిస్థితి కనిపించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. వివేక హత్య కేసులో పెద్ద కుట్ర ఉందని హైకోర్టు అభిప్రాయ పడింది. ఈ కుట్రను బయటకు తీయాల్సిన అవసరం ఉంది. అందువల్ల విచారణాధికారిని మార్చాలని, ఇప్పుడున్న అధికారిని కూడా కొనసాగించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఏప్రిల్ 10వ తేదీకి వాయిదా వేసింది.

పోలవరం ఎత్తుపై
మోదీ సర్కారు పిల్లిమొగ్గలు

- నిన్న 41.15 మీటర్లకే పరిమితమని వెల్లడి
- నేడు 45.72 మీటర్లు అంటూ డ్రామాలు
- పార్లమెంటు సాక్షిగా భిన్న ప్రకటనలు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై కేంద్ర ప్రభుత్వం డ్రామాలాడుతోంది. రోజుకో ప్రకటన చేస్తూ రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురిచేస్తోంది. పార్లమెంటు సాక్షిగా భిన్న ప్రకటనలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. బాధ్యతా రహితంగా వ్యవహరిస్తోంది. అమరావతి రాజధాని విషయంలోనూ ఇలాగే కేంద్రం భిన్న ప్రకటనలు చేసింది. అదే తరహాలో పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై ఈనెల 23న 41.15 మీటర్ల వరకే నీటి నిల్వను పరిమితం చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. తాజాగా సోమవారం మాట మార్చింది. పోలవరం ప్రాజెక్టులో నీటి నిల్వ 45.72 మీటర్లని చెప్పుకొచ్చింది. పోలవరం పురోగతిపై రాజ్యసభలో ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి విశ్వేశ్వర్ తుడు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. 1980 నాటి గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం ఎత్తు 45.72 మీటర్లు అని, నీటి నిల్వ సామర్థ్యం 41.15కి తగ్గించాలంటూ ఏపీ ప్రతిపాదించినట్టు తమకు సమాచారం లేదని తెలిపారు. ఈ నెల 23వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ డాక్టర్ సత్యవతి అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ సమాధానమిస్తూ పోలవరం మొదటి దశలో 41.15 మీటర్ల వరకు నీరు నిల్వ చేస్తామని తెలిపారు. అదేరోజు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కూడా అసెంబ్లీలో తొలిదశలో 41.15 మీటర్లకే నీటి నిల్వను పరిమితం చేస్తున్నట్లు చెప్పారు. రాజ్యసభలో తాజాగా 45.72 మీటర్ల మేరకు నీటి నిల్వ చేయనున్నట్లు మరో మంత్రి తుడు ప్రకటించారు. సవరించిన అంచనాలను కేంద్రం చెల్లిస్తుందా అని అడిగిన మరో ప్రశ్నకు ఈ అంచనాలకు

- మిగతా 2 లో

కవిత పిటిషన్‌పై
విచారణ వాయిదా

న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో తనపై ఈడీ విచారణను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. కవిత పక్షాన వాదనలు విన్న జస్టిస్ రస్తోగి నేతృత్వంలోని ధర్మాసనం... తదుపరి మూడు వారాల పాటు వాయిదా వేసింది. కాగా కవిత అభ్యర్థనను గతంలో నళిని చిదంబరం దాఖలు చేసిన పిటిషన్‌కు ధర్మాసనం జత చేసింది. మహిళలను ఈడీ కార్యాలయానికి పిలిచి విచారణ జరిపే విషయంలో గతంలో నళిని చిదంబరం ఆ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ప్రస్తుతానికి కవితకు సుప్రీంలో ఎలాంటి ఊరట దక్కలేదనే చెప్పాలి. ఇక, సుప్రీం కోర్టులో కవిత వేసిన పిటిషన్‌పై ఈడీ అధికారులు కేవియెట్ పిటిషన్ కూడా దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తమను సంప్రదించకుండా ఆదేశాలు ఇవ్వొద్దని అందులో కోరింది. ఈ క్రమంలోనే సుప్రీం కోర్టులో విచారణ సందర్భంగా కవిత తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఎంతపని చేశావయ్యా, జగనన్నా, స్కూలు పిల్లల్లా గుక్కపట్టి ఏడిపిస్తున్నావు!



నేటి నుంచి జీ-20 సదస్సు

- సర్వాంగ సుందరం విశాఖ సాగరతీరం
- 150 మంది విదేశీ ప్రతినిధులు
- నేడు సీఎం జగన్ రాక

3 లో

చర్చలేకుండానే
బడ్జెట్ ఆమోదం

కసరత్తు పూర్తి చేసిన పార్లమెంటు

న్యూఢిల్లీ: చర్చ లేకుండానే 2023-24 బడ్జెట్‌ను పార్లమెంటు ఆమోదించింది. లోక్‌సభ తాజా సవరణతో ఆర్థిక బిల్లును ఆమోదించిన తర్వాత 2023-24 బడ్జెట్‌కు పార్లమెంటరీ ఆమోదం సోమవారం పూర్తయింది. అదానీ సమస్యపై కొనసాగుతున్న గందరగోళం మధ్య ఎటువంటి చర్చ లేకుండానే రాజ్యసభ మూడు సంబంధిత చట్టాలకు ఆమోదం తెలిపింది. తొలుత, బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ.45 లక్షల కోట్ల వ్యయాన్ని రాజ్యసభ ఆమోదించింది. ఆ తర్వాత పన్ను ప్రతిపాదనలను కలిగి ఉన్న ఆర్థిక బిల్లుకు, అలాగే విభజన బిల్లుకు ఆమోదం తెలిపింది. జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంత బడ్జెట్‌తో పాటు కేటాయింపు బిల్లు, గ్రాంట్ల డిమాండ్‌లను కూడా ఆమోదించింది. ఫ్యూచర్ల ట్రేడింగ్‌పై విధించే ఎస్‌టీటీ (సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్) రేటును

- మిగతా 2 లో

దద్దరిల్లిన పార్లమెంటు

- అదానీ వ్యవహారం... రాహుల్ అనర్హతపై విపక్షాల నిరసన
- నల్ల దుస్తులతో ఎంపీల ఆందోళన

2 లో

ఇజ్రాయిల్‌లో భారీ నిరసన ప్రదర్శనలు

టెల్ అవీవ్: దేశంలో న్యాయ వ్యవస్థలో సంస్కరణల పేరిట తనను కాపాడుకోవాలని ప్రధాని బెంజిమన్ నెతన్యాహు చేసిన ప్రతిపాదనకు వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున జెరూసలేంలో నిరసన చేపట్టారు. సంస్కరణలు ఆపాలన్న రక్షణ మంత్రి గాలెంట్‌ను తొలగించడంతో ప్రజలు ఉద్యమించారు. జెరుసలెంలో జరిగిన ఈ భారీ ప్రజా ప్రదర్శనలో పోలీసులు, సైనికులు వాటర్ క్యానన్లతో నిరసనకారుల్ని చెదరగొట్టేందుకు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత చెలరేగింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్ ప్రజలు వేల సంఖ్యలో ప్రధానికి వ్యతిరేకంగా గళమెత్తారు.. ఆ దేశ రక్షణ మంత్రి యోవా గాలెంట్‌ను తొలగించారన్న ప్రధాని నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు ఆందోళన చేపడుతున్నారు. న్యాయ వ్యవస్థను మార్చాలని నెతాన్యాహు చేసిన ప్రతిపాదనకు వ్యతిరేకంగా రక్షణ మంత్రి మాట్లాడారు. దీంతో ఆయన్ను క్యాబినెట్ నుంచి ప్రధాని తొలగించారు. న్యాయ వ్యవస్థలో చేపట్టాలనుకుంటున్న సంస్కరణలను ఆపివేయాలని ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్ పిలుపునిచ్చారు. కొత్త చట్టాల సంస్కరణల ప్రకారం.. జడ్జిల నియామకం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉంటుంది. ఈ విషయంలో వ్యతిరేక వ్యక్తం అవుతోంది. కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జోరందుకున్నాయి. అన్‌ఫిట్‌గా తేలిన నాయకున్ని తొలగించాలన్న నిబంధనలను కూడా మార్చనున్నారు. అయితే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బెంజిమన్ నెతన్యా చట్టాల మార్పుతో శిక్ష నుంచి తప్పించుకోవాలని చూస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త చట్టాలకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళన చేపడుతున్నారు.

ఖతిన్ హత్యాకాండకు 80 ఏళ్లు

ఖతిన్: నాజీలు, ఉక్రేనియన్ ఫాసిస్టులు బెలారష్యన్ గ్రామమైన ఖతిన్‌లో జరిపిన హత్యాకాండ జరిగి 80 సంవత్సరాలు గడిచాయి. అప్పటి ఈ దారుణ మారణ కాండలో 75 మంది చిన్నారులు సహా 149 మంది దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఊచకోత మార్చి 22, 1943 న జరిగింది, క్రూరమైన ఫాసిస్టులు గ్రామం లోకి ప్రవేశించి చుట్టుముట్టారు. గ్రామస్థులు, చిన్నారులు,వృద్ధులు, మహిళలు, పిల్లలు - వారి ఇళ్ల నుండి షెడ్‌లోకి తరిమికొట్టి మూకుమ్మడిగా హతమార్చారు. అక్కడ ఫాసిస్టులు రైఫిల్ బట్లతో కాల్చి చంపిన ఘటనలు. రోగులను వారి మంచాలపై నుండి తుపాకులతో కాల్చి చంపారు. వారు వృద్ధులపట్ల గానీ, పసిపాపలతో ఉన్న స్త్రీలపైగానీ కనికరం చూపలేదు. వారిలో 9 మంది పిల్లలతో జోసెఫ్, అన్నా బరనోవ్స్కీ కుటుంబం, అలెక్స్, అలెగ్జాండ్రా నోవిట్స్కీ వారి 7 మంది పిల్లలతో కూడా ఉన్నారు. అదేవిధంగా, కజిమీర్, ఎలెనా ఐయోట్కో కుటుంబంలో 7 మంది పిల్లలు ఉన్నారు, చిన్న అబ్బాయికి 1 సంవత్సరం మాత్రమే. వెరా యాస్కెవిచ్ కూడా తన 7 వారాల కొడుకు టోలిక్‌తో కలిసి షెడ్‌లోకి వెళ్లింది. లిటిల్ లీనా యాస్కెవిచ్ మొదట ఫామ్ స్టెడ్‌లో దాచడానికి ప్రయత్నించాడు, నాజీలు షెడ్‌ను గడ్డితో కప్పి కాల్పులు జరిపారు. క్షణాల్లో చెక్క షెడ్డు కాలిపోయింది. ఆ పొగలో పిల్లలు ఉక్కిరిబిక్కిరి అయి మరణించారు. షెడ్ తలుపులు డజన్ల కొద్దీ ప్రజల బలాన్ని, ఒత్తిడిని తట్టుకోలేక కూలిపోయాయి. కాలిపోతున్న బట్టలతో భయాందోళనకు గురైన ప్రజలు విలవిలలాడి పారిపోయారు. కానీ ఫాసిస్టులు తమ మెషిన్ గన్‌లతో మంటల నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించిన వారిని నిర్దాక్షిణ్యంగా చంపారు. ఈ మారణకాండలో 75 మంది చిన్నారులు సహా 149 మంది సజీవ దహనమయ్యారు. చిన్న పాప వయసు కేవలం 7 వారాలే. ఆ తర్వాత గ్రామాన్ని దోచుకుని తగలబెట్టారు. ఖాటిన్ విషాదం ఎపిసోడ్ మాత్రమే కాదు. బెలారస్ జనాభాకు సంబంధించి మారణహోమం, ఈ దారుణమారణహోమం విధానం ప్రత్యక్ష సాక్ష్యమిచ్చే వెయ్యి వాస్తవాలలో ఇది ఒకటి. జర్మన్ ఆక్రమణలో ఉన్న అన్ని సంవత్సరాలలో నాజీలు ఈ విధానాన్ని అనుసరించారు. బెలారస్ భూమిని ఆక్రమించిన మూడు సంవత్సరాలలో (1941 - 1944) వందలాది ఇలాంటి విపత్తులు సంభవించాయి. మొత్తంగా, నాజీ ఆక్రమణ చేపట్టిన మూడు సంవత్సరాలలో బెలారస్‌లో 2,000,000 మంది ప్రజలు మృతిచెందారు.

ఎర్డోగాన్‌కు ఓటు వద్దు: టర్కీ కమ్యూనిస్టులు

టర్కీ: స్వదేశీ, విదేశీ పెట్టుబడికి వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరిని రానున్న ఎన్నికల్లో చేపట్టాలని టర్కీ కమ్యూనిస్టు పార్టీ(టీకేపీ) పిలుపునిచ్చింది. టర్కీ సామ్రాజ్యవాద వ్యతిరేక, విప్లవాత్మక, సోషలిస్టు, కమ్యూనిస్ట్ శక్తులు ఉమ్మడి ఎన్నికల కూటమి కింద మే 14న జరిగే పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రవేశించాలని టర్కీ కమ్యూనిస్ట్ పార్టీ ప్రకటించింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ టర్కీ పార్లమెంటరీ ఎన్నికలలో స్వంత పేరు, అభ్యర్థులతో కలిసి సోషలిస్ట్ శక్తుల సహకారంతో ఎన్నికల్లో పోటీ చేయనుంది. మొత్తం 81 ప్రావిన్స్‌లలో అన్ని ఎన్నికల జిల్లాలలో అభ్యర్థులను నామినేట్ చేస్తుందని తెలిపింది. ఎన్నికల ప్రక్రియలో ప్రచారం, సంస్థాగత నిర్ణయాలతో కమ్యూనిస్ట్ ఉద్యమం చారిత్రకంగా దూసుకుపోయేలా అన్ని అవకాశాలను వినియోగించుకోనుంది. ప్రజాభిప్రాయంతో మద్దతు పొందిన టీకేపీ పిలుపును అన్ని వామపక్ష పార్టీలు స్వీకరించినట్లు పేర్కొన్నాయి. అదే తేదీన జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ టర్కీ కెమాల్ కిలిడారోగ్లుకు ఓటు వేయాలని పిలుపునిచ్చింది. ఎన్నికలలో పాల్గొనే హక్కు కలిగిన లేబర్, ఫ్రీడమ్ అలయన్స్‌లోని రెండు పార్టీలు, సోషలిస్టు ఉద్యమం దాని సొంత లక్ష్యాలు, సూత్రాలతో స్వతంత్ర ఎన్నికల కూటమిలో చేరాలని పిలుపును స్వాగతించినట్లు పేర్కొంది. భిన్నమైన వ్యవస్థాపక సూత్రాలను కలిగి ఉన్న ప్రజా కూటములను ఈ ఎన్నికల్లో పాల్గొనవలసిందిగా టీకేపీ ఆహ్వానించింది. పెట్టుబడీదారీ విధానానికి వ్యతిరేకంగా శ్రామిక ప్రజల కోసం, అమెరికా అనుకూల స్థానాలకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ, మతపరమైన వర్గాలకు వ్యతిరేకంగా లౌకికవాదాన్ని వామపక్షాలు వ్యక్తీకరించాలని టీకేపీ గట్టి పిలుపునిచ్చింది.

ఎమ్మెల్యేల కొనుగోలుపై

సీఐడీ, ఈడీ జోక్యం: ఎమ్మెల్సీ డొక్కా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు ఓటుకు నోటుతో పాటు తాజాగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బులు ప్రభావం చూపినట్లు వస్తున్న సంఘటనలపై తక్షణమే సీబీసీఐడీ, ఈడీ తదితర దర్యాప్తు సంస్థలలో జోక్యం చేసుకుని విచారించాలని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ కోరారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 26న రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ తనకు డబ్బులివ్వడానికి ఒక ఎమ్మెల్యే ద్వారా చంద్రబాబు మనుషులు కొందరు సంభాషించినట్లు, దానిని తిరస్కరించినట్లు చెప్పారని గుర్తుచేశారు. దానిపై టీడీపీ ఎమ్మెల్యే రామరాజు రాపాకతో మాట్లాడిన మాట వాస్తవమేనని ఒప్పుకున్నారని తెలిపారు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడినందుకు వెంటనే కేసు నమోదు చేయాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలోనూ ఇలాంటి ప్రయత్నాలు చేసి ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికారని గుర్తుచేశారు. ఒక్కో ఎమ్మెల్యేకి రూ.10 నుంచి రూ.20 కోట్లు ఇస్తామన్నారని ఎమ్మెల్యేలు రాపాక, మద్దాళి గిరి తెలిపారని, మళ్లీ రాష్ట్రంలో అలాంటి సంఘటనలే పునరావృతం కావడం దుర్మార్గమని తప్పుపట్టారు. వీటన్నిటిపై వెంటనే సీబీసీఐడీ విచారణ జరపాలని, దీనికి సంబంధించిన వారిని అరెస్ట్ చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణాలో జరిగిన ఓటుకు నోటు కేసును కూడా దీనితో కలిపి విచారించాలన్నారు. ఉండవల్లి శ్రీదేవి తన మార్గంలో ప్రయాణించి వెళ్లిపోయారని, పార్టీ ఆదేశాలను విభేదించి ఇతర పార్టీలతో కలిసిపోయారనేది పార్టీ నమ్మిందన్నారు. సస్పెన్షన్ అనంతరం ఆమె కంగారు పడుతూ ఎందుకు అమరావతి నినాదాన్ని ఎత్తుకున్నారంటూ నిలదీశారు.

చర్చలేకుండానే 'బడ్జెట్' ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

సరిచేయాలని కోరుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన తాజా సవరణతో ఆర్థిక బిల్లుకు ఆమోదం పొందింది. 64 అధికారిక సవరణలతో కూడిన ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపిన తర్వాత, ఆప్షన్స్ ట్రేడింగ్‌పై ఎస్‌టీటీలో మార్పునకు సంబంధించి సవరణలలో ముద్రణా లోపం ఉందని ఆర్థిక మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. భారత ప్రభుత్వం అమలులో ఉన్న విధానానికి అనుగుణంగా లోపాన్ని సరిదిద్దుతామని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. సవరణల ప్రకారం, ఎంపికలపై ఎస్‌టీటీ 0.017 శాతం నుంచి 0.021 శాతానికి పెరిగింది. సవరించిన ఆర్థిక బిల్లును లోక్‌సభకు సమర్పించారు. అదానీపై ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు సృష్టించిన గందరగోళం మధ్య అది కూడా ఆమోదం పొందింది. విపక్ష సభ్యుల నిరసనల నడుమ రాజ్యసభ సిఫార్సు మేరకు ఆర్థిక బిల్లుకు సవరణలు చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను అధ్యక్ష స్థానంలో ఉన్న రమాదేవి కోరారు. గందరగోళం మధ్య మూజు వాణి ఓటు సవరణ ఆమోదం పొందడంతో బడ్జెట్ కసరత్తు పూర్తయింది. శుక్రవారం లోక్‌సభ ఆమోదించిన ఆర్థిక బిల్లు 2023లో ఆప్షన్‌లపై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను 0.05 శాతం నుంచి 0.0625 శాతానికి, ఫ్యూచర్స్ కాంట్రాక్టులపై 0.01 శాతం నుంచి 0.0125కి పెంచాలని ప్రతిపాదించారు. ఫ్యూచర్స్ విభాగంలో వ్యాపారులు ఇప్పుడు రూ.1 కోటి టర్నోవర్‌పై రూ.1,250 ఎస్‌టీటీ చెల్లించాల్సి ఉంటుంది. కొత్త ఆర్థిక సంవత్సరం 2023-24 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయి. ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చే కొత్త పన్ను విధానం ప్రకారం, పన్ను చెల్లింపుదారు రూ.7 లక్షల వార్షిక ఆదాయం కలిగి ఉంటే, అతను పన్ను చెల్లించడు. అయితే రూ.7,00,100 ఆదాయం ఉంటే రూ.25,010 పన్ను చెల్లిస్తారు. ఇలా రూ.100 అదనపు ఆదాయం రూ.25,010 పన్నుకు దారి తీస్తుంది. అయితే రూ.7 లక్షల ఆదాయానికి మించి చెల్లించాల్సిన పన్ను ఉండకూడదని సవరణలో పేర్కొన్నారు. దీని అర్థం, రూ.7,27,700 వరకు ఆదాయం ఉన్న వ్యక్తి ఈ ఉపాంత ఉపశమనం నుంచి ప్రయోజనం పొందవచ్చు.

మోదీ సర్కారు పిల్లిమొగ్గలు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి ఒకే కమిటీ రెండు సిఫార్సులు చేసిందని తెలిపారు. 2017-18 ధరల మేరకు సవరించిన అంచనా వ్యయం రూ.47,725 కోట్లుగా ఉందన్న కేంద్ర ప్రభుత్వం... 2019లో తమకు వచ్చిన సవరించిన అంచనా వ్యయం రూ.55,548 కోట్లు అని పేర్కొంది. ఈ అంచనాలను జలశక్తి శాఖ సాంకేతిక సలహా కమిటీ అంగీకరించిందని చెప్పింది. ఆర్‌సీసీ అధ్యయనంలో అంచనా వ్యయం రూ.47,725 కోట్లుగా నిర్ధారణ అయిందని వెల్లడించింది. 2013-14 ప్రకారం అంచనా వ్యయం రూ.29,027 కోట్లుగా పేర్కొన్న కేంద్రం... భూసేకరణ, పరిహారం, పునరావాస ఖర్చు వల్లే ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగిందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు చేసిన ఖర్చులో రూ.13,463 కోట్లు చెల్లించామని వివరించింది. అయితే ప్రాజెక్టు ఎత్తుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజుకో విధంగా చేస్తున్న ప్రకటనలను గమనిస్తుంటే ఈ ప్రాజెక్టు విషయాన్ని పూర్తిగా రాజకీయం చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికే పూర్తి కావలసిన ప్రాజెక్టు రకరకాల కారణాలతో నత్తనడకన సాగుతోంది. ఇంత వరకూ ప్రధాన ప్రాజెక్టు ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్‌డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) డిజైన్లు సిద్ధం కాలేదు. అప్రోచ్ చానల్ పనులు ఇంకా 36.54 శాతం మిగిలి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మాణ పనులు, పునరావాస ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే లోక్‌సభ సాక్షిగా చెప్పడం గమనార్హం.

దద్దరిల్లిన పార్లమెంటు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై అనర్హత, అదానీ గ్రూప్ వ్యవహారంపై ప్రతిపక్షాల నిరసనలతో పార్లమెంటు ఉభయ సభలు సోమవారం వాయిదాపడ్డాయి. రాహుల్ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఎంపీలతో పాటు అనేక విపక్ష పార్టీల ఎంపీలు కూడా నల్ల దుస్తులు ధరించి పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యారు. ఉభయ సభలు వాయిదా పడటంతో పార్లమెంటు ప్రాంగణంలో సోనియా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్, విపక్ష ఎంపీలు నిరసన చేపట్టారు. ఈ నిరసనలో బీఆర్ఎస్ ఎంపీలు కూడా పాల్గొని సోనియా గాంధీ ముందు కూర్చుని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. సోమవారం పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. రాహుల్‌పై అనర్హత వేటు, అదానీ వ్యవహారంపై విపక్ష సభ్యులు గట్టిగా నినాదాలు చేశారు. ప్లకార్డులు చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాయి. కొందరు సభ్యులు వెల్‌లోకి దూసుకువెళ్లి నినాదాలు చేశారు. పరిస్థితి గందరగోళంగా మారడంతో ప్రారంభమైన కేవలం నిమిషానికే ఉభయ సభలు వాయిదా పడ్డాయి. రాజ్యసభను చైర్మన్ జగదీప్ ధన్కర్ మధ్యాహ్నం 2 గంటల వరకు, లోక్‌సభను స్పీకర్ ఓం బిర్లా సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు రాజ్యసభ తిరిగి సమావేశమైన వెంటనే చైర్మన్ జగదీప్ ధన్కర్ గందరగోళం మధ్య బిల్లులను తిరిగి ఇచ్చే ప్రక్రియను ప్రారంభించారు. సభ మొదట జమ్ముకశ్మీర్ బడ్జెట్‌ను, తరువాత విభజన బిల్లులు, ఆర్థిక బిల్లు-2023ని తిరిగి ఇచ్చింది. ఆర్థిక బిల్లును చర్చకు తరలిస్తున్నప్పుడు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత వారం లోక్‌సభ ఆమోదించిన బిల్లులో సెక్యూరిటీల లావాదేవీల పన్ను రేట్లను సరిచేయడానికి సవరణను ప్రవేశపెట్టారు. ధన్కర్ సభ్యులను చర్చకు ఆహ్వానించినప్పటికీ, ప్రతిపక్ష ఎంపీలు అదానీ అంశంపై చర్చించాలని, ఈ అంశంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ సభకు అంతరాయం కలిగించారు. తరువాత బిల్లులు చర్చ లేకుండా మూజు వాణి ఓటు ద్వారా లోక్‌సభకు తిరిగి వచ్చేలా ఆమోదం పొందాయి. లోక్‌సభ కూడా ఈ బిల్లులను గత వారం చర్చ లేకుండానే ఆమోదించింది. అనంతరం రాజ్యసభను మంగళవారానికి వాయిదా వేశారు. లోక్‌సభకు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ అనర్హత వేటుకు నిరసనగా మధ్యాహ్న భోజనానికి ముందు జరిగిన సెషన్‌లోనూ ప్రతిపక్ష ఎంపీలు నల్ల బట్టలు ధరించి అదానీ అంశంపై దుమారం సృష్టించారు. చైర్మన్ ధన్కర్ తన స్థానంలో కూర్చోకముందే కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నినాదాలు చేయడం ప్రారంభించారు. దీంతో ఆయన సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు.

లోక్‌సభలో గందరగోళం

లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు నల్ల దుస్తులు ధరించి వెల్‌లోకి దూసుకెళ్లారు. ఇద్దరు కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ స్థానం వైపు కాగితాలు విసిరారు. రాహుల్ గాంధీ అనర్హత, అదానీ సమస్యపై గందరగోళం కొనసాగడంతో సోమవారం సాయంత్రం 4 గంటల వరకు సభ వాయిదా పడింది. సభ సమావేశమైన వెంటనే కాంగ్రెస్ సభ్యులు నల్ల కండువాలు ధరించి నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకువెళ్లారు. ప్లకార్డులు పట్టుకుని వెల్‌లో ఉన్న ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు టి.ఎన్.ప్రతాపన్, హిబీ ఈడెన్ కండువాలతో పాటు ఆర్డర్ పేపర్లను కుర్చీపైకి విసిరారు. 'ప్రియమైన ఈడీ దారో మత్, అదానీ పర్ రైడ్ కరో (ఈడీకి భయపడవద్దు, అదానీపై దాడి చేయండి)' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ నల్ల కండువా ధరించగా, ఆమె పార్టీకి చెందిన ఇతర సభ్యులు నల్ల చొక్కాలు ధరించారు. నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా నల్ల కుర్తా ధరించారు. విపక్ష సభ్యుల నిరసన మధ్య లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయంలో సభ ప్రారంభమైన నిమిషంలోపే సభను వాయిదా వేశారు.

ప్రజలపై స్మార్ట్ భారం: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ద్వారా వినియోగదారులకు తెలియకుండా విద్యుత్ భారాలు మోపాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఖండించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ...అదనపు లోడ్, పీక్ డిమాండ్ పేరుతో ప్రజలపై దొడ్డిదారిన విద్యుత్ భారాలు వేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని, కనెక్టెడ్ లోడ్ కన్నా ఎక్కువ వినియోగిస్తే ఆ మేరకు అదనంగా చార్జీలు వసూలు చేయాలని, డిమాండ్ అధికంగా ఉన్నప్పుడు విద్యుత్ వినియోగానికిగాను 20శాతం అధికంగా చార్జీలు వసూలు చేయాలని కేంద్రం ఆదేశించడాన్ని తప్పుపట్టారు. ఎలక్ట్రిసిటీ (రైట్ ఆఫ్ కన్స్యూమర్) సవరణ రూల్స్-2023 ముసాయిదాపై ఏప్రిల్ 14 లోపు అభిప్రాయాలు చెప్పాలంటూ రాష్ట్రాలను కేంద్రం కోరిందని, విద్యుత్ వినియోగదార్లపై దొంగదెబ్బ తీసే ఈ ప్రతిపాదనల్ని ప్రభుత్వం తిరస్కరించాలన్నారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తీసుకునే సమయంలో వినియోగదారులు వాడుకునే విద్యుత్ ఉపకరణాల ఆధారంగా కిలోవాట్, 2 కిలోవాట్, 3 కిలోవాట్...ఇలా లోడ్ ప్రకారం డిస్కమ్ కనెక్షన్లు ఇస్తాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వ షరతులకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాల్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

కవిత పిటిషన్‌పై విచారణ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ఈడీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. కవితను విచారణకు రమ్మని నోటీసులు ఇచ్చారు... ఆమె నిందితురాలు కానప్పుడు విచారణకు ఎలా పిలుస్తారని అన్నారు. నిందితురాలిగా అభివర్ణిస్తున్నారని పేర్కొన్నారు. రెండు పక్షాల వాదనలు విన్న జస్టిస్ రస్తోగి... నళిని చిదంబరం, అభిషేక్ బెనర్జీ విషయాలతో ఈ అంశాన్ని ట్యాగ్ చేస్తామని అన్నారు. విషయం వినడానికి వీలు కల్పిస్తామని, ట్యాగ్ చేసి వినడం మంచిదని అని పేర్కొన్నారు. అయితే సొలిసిటర్ జనరల్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ అలా చేయవద్దని, అభిషేక్ బెనర్జీ విషయం వేరని అన్నారు. ఈ క్రమంలోనే నళిని చిదంబరం పిటిషన్‌కు ట్యాగ్ చేస్తున్నట్టుగా జస్టిస్ రస్తోగి చెప్పారు. ఇదిలా ఉండగా కవిత తన పిటిషన్‌లో కొత్త అభ్యర్థన చేశారు. మద్యం పాలసీ కేసు విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఎత్తు తగ్గింపును సహించం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాలలో పర్యటించి...అన్ని పక్షాలను కలుపుకొని దిల్లీ వెళ్లి ఎంపీలను, కేంద్రమంత్రులను, ప్రతిపక్షాలను కలిసి పోలవరం ప్రాజెక్టుకు జరుగుతున్న అన్యాయం గురించి విశదీకరిస్తామని తెలిపారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, ఏలూరు జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తు కుదించి మినీ రిజర్వాయర్‌గా చేయడానికి కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. వరదల కారణంగా ముంపునకు గురైన కుక్కునూరు, వేలేరుపాడు ప్రాంత ప్రజలకు నష్టపరిహారం నేటికీ చెల్లించలేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గురించి, నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం గతంలో ఎనిమిది రోజులపాటు సీపీఐ పాదయాత్రలు చేసి లక్ష సంతకాలు సేకరించిందని తెలిపారు. సీపీఐ రాష్ట్ర నాయకులు చలసాని వెంకట రామారావు, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, రైతుసంఘం రాష్ట్ర నాయకులు కొమ్మన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలోనూ కేంద్రం అన్యాయం: జేవీఎస్ మూర్తి

తొమ్మిదేళ్లుగా విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం... తాజాగా పోలవరం ప్రాజెక్టు విషయంలోనూ తీరని అన్యాయం చేస్తున్నదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మండిపడ్డారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా నిర్మాణాన్ని పూర్తి చేయాలని, నిర్వాసితులకు పునరావాసం, నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ విశాఖ జిల్లా సమితి అధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్మాణ ఎత్తును కుదిస్తూ కేంద్రమంత్రి ప్రకటన చేస్తే రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైసీపీ ఎంపీలు నోరుమెదపడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను విస్మరించి, వారి స్వప్రయోజనాలకు తలొగ్గి రాష్ట్ర భవిష్యత్తును కేంద్రం వద్ద తాకట్టు పెడుతున్నారన్నారు. పోలవరం నిర్వాసితులకు వెంటనే పునరావాసం కల్పించి, ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించేందుకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కసిరెడ్డి సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎస్‌కే రెహమాన్, పి.చంద్రశేఖర్, ఆర్.శ్రీనివాసరావు, జి.రాంబాబు, సీఎస్ క్షేత్రపాల్ పాల్గొన్నారు.

మోదీ ఎదుట మోకరిల్లుతున్న జగన్: ముప్పాళ్ల

పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎలాంటి సడలింపులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిర్వహిస్తున్న దీక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం నాలుగు దశాబ్దాలుగా సీపీఐ మడమ తిప్పని పోరాటం చేస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తన కేసుల మాఫీ కోసం ప్రధాని మోదీ ముందు మోకరిల్లుతూ, ప్రాజెక్టు నిర్మాణాన్ని 133 అడుగుల ఎత్తుకు కుదించాలని, నిర్వాసితులకు అన్యాయం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదు కోట్ల ఆంధ్రుల జీవనాడి, కోస్తా జిల్లా నుంచి రాయలసీమ వరకు సాగునీటిని అందించే పోలవరం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కుని పోలవరం ప్రాజెక్టును అటకెక్కిస్తున్నాయని విమర్శించారు. దీక్ష శిబిరంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించాలి: జల్లి విల్సన్

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా పూర్తిస్థాయిలో నిర్మించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, శాసన మండలి మాజీ సభ్యులు జల్లి విల్సన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి అధ్వర్యంలో జల్లి విల్సన్, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు నాయకత్వంలో సీపీఐ బృందం కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును కలిసి వినతి పత్రం సమర్పించారు. సీపీఐ జిల్లా నాయకులు బుడ్డి రమేశ్, మహిళా సమాఖ్య నాయకులు పంచదార్ల దుర్గాంబ, రైతు సంఘం జిల్లా కన్వీనర్ మల్నీడి యల్లమందరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహారావు, సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, నాయకులు మూలి సాంబశివరావు, తాడి పైడియ్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి మౌనం వీడాలి: ఈశ్వరయ్య

పోలవరం ప్రాజెక్టులో నీటి సామర్థ్యం తగ్గించే ఆలోచన మానుకోవాలని, 45.72 మీటర్ల నీటిమట్టంతో నిర్మించాలని, ఎత్తు తగ్గించాలన్న కేంద్రం కుట్రపై సీఎం జగన్ మౌనం వీడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. రాయచోటి కలెక్టరేట్ వద్ద సీపీఐ చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నీటి వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం కేంద్ర జలవనరుల సంఘం ఆమోదించిన... రాష్ట్ర విభజన చట్టంలో జాతీయ హోదా కల్పించిన పోలవరం ప్రాజెక్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురవుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం నాటి సీఎం రాజశేఖర్ రెడ్డి పోలవరం ప్రాజెక్టు కట్టాలని ప్రయత్నిస్తే, ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తామని కేంద్రం చెబుతన్నా ఆయన కుమారుడు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎస్ నర్సింహులు, సహాయ కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం దుర్మార్గం: జగదీశ్

పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ఎత్తు తగ్గించడం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్ విమర్శించారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, రంగయ్య, రమణ, రాజేశ్ గౌడ్, సంతోశ్ కుమార్, వీరభద్రస్వామి, మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుల్లాయ్ స్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకుడు రామాంజనేయులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. జగదీశ్ దీక్షలు ప్రారంభించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని బటన్‌లు నొక్కినా లాభం లేదు: జంగాల

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరాన్ని పూర్తి చేయకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్ని బటన్‌లు నొక్కినా ప్రయోజనం శూన్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. పోలవరం ప్రాధాన్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించకపోతే తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా పూర్తి స్థాయిలో నిర్మించాలని కోరుతూ సీపీఐ గుంటూరు జిల్లా సమితి అధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సామూహిక దీక్షలు చేపట్టారు. సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా, నగర నేతలు పాల్గొన్నారు.

కర్నూలులో: పోలవరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించాలని కర్నూలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరాహారదీక్షలను సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆవుల శేఖర్, ఎన్.లెనిన్‌బాబు ప్రారంభించారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సి.మహేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బి.గిడ్డయ్య, కె.జగన్నాధం, ఎన్.మునెప్ప, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో

పోలవరం ఎత్తు తగ్గింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రకాశం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాకు సీపీఐ జిల్లా సమితి సభ్యులు కె.వీరారెడ్డి అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌నారాయణ, ఆర్.వెంకట్రావు, పీవీఆర్ చౌదరి, పి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే ఆలోచనను కేంద్రం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శులు మాకిరెడ్డి రామానాయుడు, రాజాన దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో

పోలవరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ కలెక్టరేట్‌కు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం ముందు నిర్వహించిన ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శులు తోకల ప్రసాద్, జి.లోవరత్నం తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో: పోలవరం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయనగరం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన దీక్షల్లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో: పోలవరం ఎత్తు తగ్గించకుండా నిర్మించాలని డిమాండ్‌చేస్తూ పార్వతీపురం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన దీక్షల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, జిల్లా కార్యవర్గసభ్యులు గరుగుబిల్లి సూరయ్య, ఈవీ నాయుడు, కూరంగి గోపి, పువ్వుల ప్రసాద్, వెంకట్రావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: పోలవరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించాలని భీమవరం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన దీక్షల్లో జిల్లా సీపీఐ కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, సీహెచ్ రంగారావు, సీతారాం ప్రసాద్, బొద్దాని నాగరాజు, కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు 21రోజుల్లోనే సకల అనుమతులు

- పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- నూతన పారిశ్రామిక విధానం ఆవిష్కరణ

విశాలాంధ్ర-విశాఖపట్నం: పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులన్నీ 21రోజుల్లోనే ఇవ్వనున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. నూతన పారిశ్రామిక విధానా(2023-27 ఇండస్ట్రియల్ పాలసీ)న్ని మంత్రి అమర్‌నాథ్ సోమవారం విశాఖలో ఆవిష్కరించారు. అలాగే పరిశ్రమల అనుమతులకు సంబంధించిన వైయస్సార్ ఏపీ1 యాప్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'లో కాస్ట్ ...లో రిస్క్ బిజినెస్' ప్రధానంగా ఏపీ పారిశ్రామిక విధానం ఉంటుందన్నారు. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానంలో ప్రాధాన్యత కల్పించిందన్నారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన 96 క్లియరెన్స్ లను కేవలం 21 రోజుల్లోనే మంజూరు చేసేందుకు వైయస్సార్ ఏపీ1 అనే కొత్త యాప్‌ను ప్రారంభించామని, విశాఖ కేంద్రంగా వైయస్సార్ ఏపీ 1 సెంటర్ ని అందుబాటులో తీసుకొస్తామన్నారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో జిల్లా పరిశ్రమల కేంద్రాలలో సబ్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నామని మంత్రి వివరించారు. ఇక రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి 21 రోజుల్లోనే భూ కేటాయింపులు చేస్తామని తెలియజేశారు. పారిశ్రామిక రంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇటీవల గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ లో 14 సెక్టార్లను పరిగణలోకి తీసుకున్నామని ఆయా సెక్టార్లలో పెట్టుబడులు రాబట్టనున్నామని మంత్రి అమర్‌నాథ్ పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, మెడికల్ డివైజెస్ తయారీ, గ్రీన్ హైడ్రోజన్, రెన్యువబుల్ ఎనర్జీ రంగాలలో పెద్ద ఎత్తున పెట్టుబడులు రానున్నాయని చెప్పారు. అదేవిధంగా డిఫెన్స్, ఎరోస్పేస్ రంగాలలో 15,000 కోట్ల రూపాయల జాయింట్ వెంచర్ ప్రారంభించనున్నామని తెలిపారు. కాగా నూతన పారిశ్రామిక విధానంలో ఇటు ప్రభుత్వానికి, పారిశ్రామిక వేత్తలకు ప్రయోజనం కలిగే విధంగా చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి నూతన పారిశ్రామిక విధానం అద్దం పడుతుందని అమర్‌నాథ్ వివరించారు. రాష్ట్రంలోని 974 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోబోతున్నామని, తీరం వెంబడి పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టడంతో పాటు, వీటిని ఆనుకుని సుమారు 48 వేల ఎకరాలలో పోర్టు ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. రోడ్డు రవాణా వాడకాన్ని తగ్గించి, జల రవాణాను ప్రోత్సహించనున్నామని ఆయన చెప్పారు. ఇక ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో కొత్త ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ యోచిస్తున్నట్లు అమర్‌నాథ్ తెలిపారు. ఇప్పటికే శ్రీ సిటీ ఇండస్ట్రియల్ పార్క్ ప్రపంచానికి ఒక ఉదాహరణగా నిలిచిందని ఆయన అన్నారు. అలాగే ప్రైవేట్ ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేయనున్నామని కూడా మంత్రి చెప్పారు. ఐటీ రంగంలో మాదిరిగా వాక్ టు వర్క్ కాన్సెప్ట్ ని మిగిలిన పరిశ్రమలకు తీసుకొస్తామని, ఇన్నోవేషన్ రంగాన్ని ప్రోత్సహించేందుకు విశాఖలో ఐ స్పేస్ పేరుతో ఒక ఐకానిక్ టవర్‌ను నిర్మించనున్నామని తెలియజేశారు. కాగా రాష్ట్రంలోని వేర్ హౌసింగ్‌కు పరిశ్రమల హోదా కల్పిస్తూ నూతన పారిశ్రామిక విధానంలో దానిని పొందుపరిచామని చెప్పారు. నూతన పారిశ్రామిక విధానాన్ని సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వల్లవన్ మాట్లాడుతూ... పరిశ్రమలను ఆంధ్రప్రదేశ్‌లోనే ఎందుకు ఏర్పాటు చేయాలి? ఇక్కడ ప్రత్యేకతలు ఏంటి? తదితర అంశాలు పారిశ్రామికవేత్తలకు తెలిసేలా నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించామని చెప్పారు. పారిశ్రామిక విధానంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు బాగున్నాయని కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, రాష్ట్రంలోని పారిశ్రామిక విధానంపై ఆరా తీసిన తర్వాతే పారిశ్రామిక వేత్తలు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. ఏ దేశాలకు ఏ ఏ వస్తువులు అవసరమవుతాయన్న సమాచారాన్ని సేకరించి, అందుకు తగ్గట్టు ఉత్పత్తులను తయారు చేయాలని పారిశ్రామికవేత్తలకు ఆయన సూచించారు.

పరిశ్రమల శాఖ డైరెక్టర్ సుజనా మాట్లాడుతూ... ప్లగ్ అండ్ ప్లే ఫెసిలిటీని కొత్త పారిశ్రామిక విధానం మార్గదర్శకాల్లో పొందుపరిచామని చెప్పారు. నూతన పారిశ్రామిక విధానంలో పోర్టు ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ సలహాదారు శ్రీధర్, శ్రావణి షిప్పింగ్ అధినేత సాంబశివరావు, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, సీఐఐ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌తో సీఎం భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో సీఎం వైఎస్ జగన్ సోమవారం భేటీ అయ్యారు. తాడేపల్లి నుంచి జగన్ రాజ్‌భవన్‌కు వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. దాదాపు 15 నిమిషాలు వారిద్దరి మధ్య సమావేశం జరిగింది. ఇటీవల ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వివరాలు తెలిపారు. అసెంబ్లీకి హాజరై ప్రసంగం చేసినందుకు గవర్నర్‌కు సీఎం ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపినట్లు సమాచారం. నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసిన అంశాన్ని గవర్నర్ దృష్టికి సీఎం తీసుకెళ్లినట్లు తెలిసింది. భేటీ అనంతరం సీఎం జగన్ నేరుగా తాడేపల్లికి చేరుకున్నారు.

అరసం యువ వచన కవితా పోటీలు

వల్లూరు శివప్రసాద్ వెల్లడి

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) యువ వచనకవితా పోటీలు - 2023 నిర్వహిస్తోంది. యువ రచయితలను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం అరసం, విశాలాంధ్ర దినపత్రిక సంయుక్తంగా కథారచనల పోటీలను నిర్వహిస్తోందనీ, ఈ ఏడాది యువ వచనకవితా పోటీలను నిర్వహించాలని నిర్ణయించిందని అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 పంక్తులకు (లైన్లు) మించకుండా యువకవులు తమ కవితలు పంపించాలన్నారు. ఎంపికైన కవితలకు ప్రథమ బహుమతిగా రూ.1500,ద్వితీయ బహుమతిగా రూ.1000, తృతీయ బహుమతిగా రూ.750 ఇవ్వనున్నామని తెలిపారు.

పోటీలో పాల్గొనే వారు ఈ నిబంధనలు పాటించాలని సూచించారు. పోటీలో పాల్గొనే రచయితల వయస్సు 30 సంవత్సరాలకు మించరాదనీ, ఒక్కొక్కరు ఒక్క కవితను మాత్రమే పంపాలనీ, కవిత 30 పంక్తులు మించరాదనీ, అనువాదాలు అనుసరణలు పంపకూడదని తెలిపారు. వర్తమాన రాజకీయ, సామాజిక అంశాలకు చెందిన వస్తువుతో కవిత ప్రగతిశీలంగా ఉండాలన్నారు. మహిళలు, దళితులు, మైనారిటీలను కించపరిచే వస్తువు, ప్రతీకలు ఉన్న కవితలు పరిశీలనకు స్వీకరించబోమని స్పష్టంచేశారు. రచన తమ సొంతమనీ, ఏ ఇతర ప్రచురణ, ప్రసార సంస్థలకూ, సామాజిక మాధ్యమాలకూ పంపలేదనీ హామీ పత్రం జతచేయాలని తెలిపారు. ఎంపికైన కవితలు విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురిస్తామనీ, ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకూ తావులేదన్నారు. కవితలు ఏప్రిల్ 27వ తేదీ నాటికి ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, # 401, శ్రావణి రెసిడెన్సీ, 6/3వ లైన్, ఎస్‌వీఎన్ కాలనీ, గుంటూరు చిరునామాకు చేరాలని ఆ ప్రకటనలో వల్లూరు శివప్రసాద్ తెలిపారు. ఫలితాలు మే 1వ తేదీన ప్రకటిస్తామని వివరించారు.

1 నుంచి దివ్యదర్శనం టోకెన్లు

వేసవిలో సామాన్య భక్తులకు ప్రాధాన్యం: వై.వి.సుబ్బారెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: ఏప్రిల్ 1వ తేదీ నుంచి వారం రోజుల పాటు ప్రయోగాత్మకంగా అలిపిరి మార్గంలో 10 వేలు, శ్రీవారిమెట్టు మార్గంలో 5 వేల చొప్పున నిత్యం దివ్యదర్శనం టోకెన్లు జారీ చేయనున్నట్లు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి వెల్లడించారు. వారం రోజుల తర్వాత భక్తుల సూచనలను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం ఈవో ఎవి.ధర్మారెడ్డితో కలిసి సుబ్బారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. తిరుమలలో రానున్న వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను తెలియజేశారు. ఏప్రిల్ 15 నుండి జులై 15వ తేదీ వరకు సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వీఐపీ బ్రేక్, శ్రీవాణి, టూరిజం కోటా, వర్చువల్ సేవలు, రూ.300 దర్శన టికెట్లను తగ్గిస్తామన్నారు. బ్రేక్ దర్శనాలకు సిఫారసు లేఖలు తగ్గించాలని వీఐపీలకు విజ్ఞప్తి చేశామని, తద్వారా సామాన్య భక్తులకు త్వరితగతిన శ్రీవారి దర్శనం కల్పించడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఆలయ మాడ వీధులు సహా రద్దీ ఉండే ప్రాంతాల్లో ఎండ వేడిమికి భక్తుల కాళ్లు కాలకుండా కూల్ పెయింట్ వేయిస్తామన్నారు. తిరుమలలో 7500కు పైగా గదులుండగా 40 వేల మందికి సరిపడా వసతి అందుబాటులో ఉందన్నారు. దాదాపు 85 శాతం గదులు సామాన్య భక్తుల కోసమే కేటాయించడం జరిగిందని, ఇటీవల ప్రవేశపెట్టిన ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా గదుల కేటాయింపులో పారదర్శకతను పెంచడం జరిగిందన్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, పాత అన్నదానం కాంప్లెక్స్,పీఏసీ-2, 4తోపాటు నారాయణగిరి ఉద్యానవనాల్లోని క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లలో అన్నప్రసాదాలు పంపిణీ చేస్తామని తెలిపారు. అన్ని ముఖ్య ప్రాంతాల్లో జలప్రసాద కేంద్రాల ద్వారా భక్తులకు సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంచుతామని, మెరుగ్గా పారిశుధ్య ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రధాన కల్యాణకట్ట, మినీ కల్యాణకట్టల్లో నిరంతరాయంగా సేవలందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు కొరత లేకుండా తగినన్ని లడ్డూలు నిల్వ ఉంచుకుంటామని, టీటీడీ విజిలెన్స్, పోలీసుల సమన్వయంతో యాత్రీకులకు పార్కింగ్ సౌకర్యం కల్పించడంతోపాటు ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తామన్నారు. శ్రీవారి సేవకులతో వివిధ విభాగాల్లో భక్తులకు సేవలందిస్తామని తెలిపారు. మీడియా సమావేశంలో వివిధ విభాగాధిపతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అచ్చన్న మృతిపై సమగ్ర విచారణ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కడప జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చన్న మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కడప జిల్లా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దళిత వైద్యులు అచ్చన్న అనుమానాస్పద రీతిలో మరణించారన్నారు. 13 రోజుల అదృశ్యానంతరం అచ్చన్న అనుమానాస్పద మృతి చెందడం బాధాకరమన్నారు. అచ్చన్నది హత్యేనన్న కుటుంబ సభ్యుల ఆరోపణలతో, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కడపలో వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు ఆందోళన చేపట్టాయని పేర్కొన్నారు. పశు సంవర్ధక శాఖలోని కొందరు సిబ్బంది తనను సామాజికవర్గ పరంగా, మానసికంగా వేధిస్తున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో అచ్చన్న కలత చెందినట్లు కుటుంబ సభ్యులు విమర్శిస్తున్నారు. ఎనిమిది నెలలుగా పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో డీడీలు, ఇతర అధికారుల మధ్య వివాదం జరుగుతున్నప్పటికీ...ఉన్నతాధికారులెవ్వరూ పట్టించుకోలేదని, ఈ వివాదాల్లో డీడీ అచ్చన్ననే సస్పెండ్ చేయడాన్ని ఖండించారు. సిబ్బందితో తన తండ్రికి ఇబ్బందులు ఉన్నాయని డాక్టర్ అచ్చన్న కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం శూన్యమన్నారు. సీఎం సొంత జిల్లా కడపలోనే దళితులకు రక్షణ లేకుండా పోతోందన్నారు. దళిత డాక్టర్ అచ్చన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

చంద్రబాబు స్వార్థ రాజకీయాలు: శ్రీనివాసకుమార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం చంద్రబాబు అని వైసీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వైసీపీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేయించుకోవడం చంద్రబాబు స్వార్థ రాజకీయాలకు, దివాళాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. నాడు వైస్రాయ్ హోటల్ దగ్గర మొదలు పెట్టి ఇప్పటివరకు వేరే పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని ఎద్దేవా చేశారు. గతంలో 23 మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎంపీలను ప్రలోభ పెట్టి తన వైపునకు తిప్పుకున్న చంద్రబాబు ఇప్పుడు మరో నలుగురు ఎమ్మెల్యేలను తన వైపు తిప్పుకోవడం వాళ్లకు మంత్రి పదవుల ఆశ పెట్టడం దారుణమన్నారు. చంద్రబాబు చంద్రబాబు పరిపాలనలో కుళ్లి పోయిన ఈ రాజకీయ వ్యవస్థను మార్చాలంటూ వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ నిరంతరం పాటుపడుతున్నారని, నిజాయితీ కలిగిన రాజకీయాలు చేయాలనే ఆలోచనలతో ఉన్నారని పేర్కొన్నారు.

108లో ప్రసవం... తల్లీబిడ్డ క్షేమం

విశాలాంధ్ర-చింతపల్లి: నెలలు నిండిన గర్భిణి ప్రసవ వేదనతో ఆసుపత్రికి వెళుతూ మార్గమధ్యలో 108 వాహనంలో ప్రసవించిన ఘటన అల్లూరి సీతారామ రాజు జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. పురిటి నొప్పులతో ఉన్న మహిళను కుటుంబ సభ్యులు 108 వాహనంలో చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. గూడెం కొత్తవీధి మండలం రింతాడ గ్రామానికి చెందిన ముప్పల దిపాయి (19)కి పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమా చారం అందించారు. హుటాహుటిన గ్రామానికి చేరుకున్న 108 వాహ నంలో దిపాయిని చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొస్తుండగా అంతర్ల గ్రామ సమీపంలో 108 వాహనంలోనే మగ శిశువుకు జన్మనిచ్చింది. 108 వాహన ఈఎంటీ హరి, పైలట్ నగేశ్ శిశువును శుభ్రపరిచి స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లి, శిశువు క్షేమంగా ఉన్నట్లు వైద్యాధికారి రుక్మిణి తెలిపారు.

గద్వాల్-కర్నూలు మధ్య విద్యుదీకరించిన రైలుమార్గం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు: గద్వాల్-కర్నూలు నగరం మధ్య విద్యుదీకరించిన రైలు మార్గాన్ని దక్షిణమధ్య రైల్వే అధికారులు సోమవారం ప్రారంభించారు. దక్షిణ మధ్య రైల్వే 2022-2023 ఆర్థిక సంవత్సరంలో విద్యుదీకరణకు అధిక ప్రాధాన్యమిస్తూ... పనులను వేగవంతం చేసింది. ఈ క్రమంలో గద్వాల్- కర్నూలు సిటీ మధ్య 54 కి.మీ. దూరం వరకు విద్యుదీకరణ పనులను పూర్తి చేసింది. తద్వారా జోన్ పరిధిలో సికింద్రాబాద్ - ధర్మవరం మధ్య పూర్తిస్థాయిలో విద్యుదీకరిం చిన రైలు మార్గంలో ఇప్పుడు విద్యుత్ ట్రాక్షన్ ద్వారా రైళ్లను నడిపే వీలు కలిగింది. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ... విద్యుదీకరణ పనులను పూర్తి చేయడానికి అంకితభావంతో కృషి చేసిన ఎలక్ట్రికల్ వింగ్ అధికారులు , సిబ్బందిని అభినందించారు. గద్వాల్-కర్నూల్ స్టేషన్ల మధ్య ఈ మార్గంలో విద్యుదీకరణ పూర్తవడంతో, సికింద్రాబాద్-బెంగళూరు మధ్య మొత్తం సెక్షన్‌లో ఎలక్ట్రిక్ రైళ్లను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు తెలిపారు. జోన్ పరిధిలో ఇప్పటికే ఉన్న బ్రాడ్ గేజ్ మార్గాలను 100% విద్యుదీకరణ దిశగా వడివడిగా అడుగులు వేస్తోందని కూడా ఆయన పేర్కొన్నారు.

నట్టేట ముంచారు

- ప్రాజెక్టును రిజర్వాయర్‌గా మార్చేస్తున్నారు
- నిర్వాసితుల సంఖ్య కుదింపునకు కుట్ర
- అందుకే ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు
- పోలవరం నిర్వాసితుల ఆగ్రహం

విశాలాంధ్ర-కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల బాధలు వర్ణనాతీతం. పాలకులు తమను నమ్మించి నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నిర్వాసితుల సంఖ్య తగ్గించడం, తద్వారా ప్రాజెక్టు వ్యయం తగ్గించాలని చూడటం దుర్మార్గం. బహుళార్థ సాధక ప్రాజెక్టు కోసం భూములు త్యాగాలు చేసిన తమ పట్ల పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పుట్టిన ఊరిని, కడుపుకు పట్టెడు అన్నం పెట్టే భూమిని వదిలిన తమ త్యాగాన్ని పాలకులు అడుగడుగునా అపహస్యం చేస్తున్నారని మండిపడుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణం 45.72 మీటర్ల ఎత్తు కోసం అంచనాలు వేసి...నిర్మాణానికి పూనుకున్న ప్రభుత్వాలు...నిర్వాసితుల సంఖ్యను కుదించాలనే కుట్రతో 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటించడం నిర్వాసితుల గుండెల్లో గుబులు రేపుతోంది. 45.72 మీటర్ల ఎత్తు నిర్మాణం వల్ల 1.06 లక్షల కుటుంబాలు నిర్వాసితులవుతున్నాయి. 41.15 మీటర్ల ఎత్తుకు తగ్గిస్తే కేవలం 20,946 కుటుంబాలు మాత్రమే నష్టపోతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన తర్వాత సంభవించిన గోదావరి వరదలకు గ్రామాలకు గ్రామాలు మునిగిపోతున్నాయి. దీంతో మండలం యూనిట్‌గా భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం ఎదురుచూస్తున్న నిర్వాసితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటనలు గుబులు పుట్టిస్తున్నాయి. నిర్వాసిత కుటుంబాలకు ప్యాకేజీ పూర్తిస్థాయిలో అందలేదు. వరదల కారణంగా నాలుగేళ్లుగా వరుసగా గోదావరిలో మునుగుతున్నారు. తమ సంపాదన గోదావరికి అర్పిస్తూ కాలం గడుపుతున్నారు. తొలివిడత నిర్వాసితుల కుదింపు ఇందుకు ఉదాహరణ. బహుళార్థ సాధక ప్రాజెక్టు...పెద్ద రిజర్వాయరుగా మారేలా ప్రభుత్వ ప్రణాళిక ఉంది. కేంద్రం తాజాగా దీనినే నిర్ధారించింది. ఇప్పటి వరకు పునరావాసం, పరిహారంపై గంపెడాశలు పెట్టుకున్న నిరుపేదల పరిస్థితి ఏమిటి అనేది ప్రశ్నార్థకంగా మారింది.

పోలవరం ప్రాజెక్టు పనులను 2005లో అప్పటి కాంగ్రెస్ సర్కార్ ప్రారంభించింది. ముంపు గ్రామాలను ఖాళీ చేయించి, ప్రజలకు పరిహారం, పునరావాసం కల్పించడానికి అధికార యంత్రాంగాన్ని గిరిజన గ్రామాలకు పంపింది. ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని రూ.34 వేల కోట్లకుపైగా అంచనా వేసింది. 1,27,263 ఎకరాల భూమి అవసరమని, ఆ మేరకు సేకరణ లక్ష్యాలు నిర్ణయించుకున్నది. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 1,13,119 ఎకరాలు సేకరించింది. అనేక గ్రామాల్లో ప్రజా వ్యతిరేకత ఎదురైనా... గిరిజన, గిరిజనేతరుల నిర్బంధాల నడుమ సేకరణను ఓ కొలిక్కి తెచ్చింది. పోలవరం పరిధిలో ఉభయ గోదావరి జిల్లాల్లో లక్షా ఆరు వేల కుటుంబాలను నిర్వాసిత జాబితాలోకి చేర్చారు. వీరిలో అత్యధికులు ఆదివాసీలే. వైసీపీ అధికారంలోకి వచ్చే ముందు వరకు భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాస కాలనీల ఏర్పాటు, భూమికి భూమి పథకం సహా అనేక సహాయాలను వరుసగా ఇచ్చేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. కీలకమైన స్పిల్ వేతో పాటు ఎగువ, దిగువ కాఫర్ డ్యాం పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం పనుల వేగం తగ్గుముఖం పట్టాయనడంలో అతిశయోక్తి లేదు. పనిలో పనిగా పోలవరం ఎత్తు తగ్గింపుపై దృష్టి సారించింది. ప్రాజెక్టు ఎత్తును తొలి దశలో 41.15గా నిర్ధారించింది. దీనిని అన్ని రాజకీయ పక్షాలు వ్యతిరేకించినా సర్కార్ పట్టు వదలలేదు. అదేసమయంలో నిర్వాసితుల సహాయ, పునరావాసంపై తగిన దృష్టి పెట్టలేదు. కేంద్ర, రాష్ట్ర బృందాలు వరుసగా నిర్వాసిత గ్రామాల్లో పర్యటించినా ఫలితం కనిపించడం లేదు.

అడుగడుగునా వేధింపులు

తొలి విడతలో 20 వేల మంది నిర్వాసితులకు సహాయ, పునరావాసం కల్పించాల్సి ఉండగా...ఈ సంఖ్యను 11,677కు కుదించి నిర్వాసిత కుటుంబాలతో వైసీపీ ప్రభుత్వం చెడుగుడు ఆడింది. ఎకరానికి ఐదు లక్షల పరిహారం చెల్లిస్తామని ఎన్నికలకు ముందు చెప్పి నిర్వాసితుల ఆశలతో దోబూచు లాడింది.సీఎం జగన్ ఏదో చేస్తానని ప్రకటనలు చేస్తున్నారు.

జీవోలు విడుదల చేస్తున్నారు గానీ అమలుకు నోచుకోవడం లేదు. కుక్కు నూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో నిర్వాసితుల పరిహార జాబితా ఎక్కడికక్కడ మారుతూ వచ్చింది. ఓ వైపు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఇవ్వాల్సిన మొత్తాన్ని పూర్తిగా చెల్లించకపోవడం, ఇదేమని అడిగితే పార్టీల ముద్ర వేయడం సాధారణంగా మారింది. సొంత ఇంటి పరిహారం పేరుతో గ్రామసభలు నిర్వహించి కొన్ని పేర్లను తొలగించేశారు. నిర్వాసిత కుటుంబాల సంఖ్యను పూర్తిగా కుదించడంతో మరింత గందరగోళం ఏర్పడింది. కుక్కు నూరులో ఎనిమిది, వేలేరుపాడులో 15 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వేలేరుపాడులో ఎనిమిది రెవెన్యూ గ్రామాలు పరిహారం, పునరావాసానికి దూరం కాబోతున్నాయి. దీంతో నిర్వాసితుల ఆశలు గోదారి పాలయ్యాయి.

వైసీపీ ప్రభుత్వంపై గిరిజనుల ఆగ్రహం

ఎస్టీ జాబితాలో బోయలను చేర్చడం అన్యాయమని విమర్శ

విశాలాంధ్ర-పాడేరు: వైసీపీ పాలనలో షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ఘటనలు గిరిజనులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. గిరిజనుల హక్కులు, చట్టాలు నిర్వీర్యమవుతున్నాయి. తాజాగా బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ వైసీపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. దీంతో వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలపై గిరిజనుల్లో ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. పాడేరు పట్టణంలో ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఫ్లెక్సీలను గిరిజనులు ధ్వంసం చేశారు. రిజర్వేషన్లు, హక్కులు, చట్టాలు, ప్రయోజనాలు నిర్వీర్యమవుతున్నప్పటికీ వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎస్టీ కమిషన్ చైర్మన్ నిర్లక్ష్యం ప్రదర్శించడంపై గిరిజనులు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి నిరసనగా పార్టీలు, కులాలు, మతాలు, సంఘాలకతీతంగా గిరిజనులందరూ రోడ్డెక్కుతున్నారు. జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో, సోషల్ మీడియాలో గిరిజనులు స్వచ్ఛందంగా వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనలు తెలుపుతున్నారు. గిరిజనులు వాట్సాప్ గ్రూపుల వేదికగా ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబుపై విరుచుకుపడుతున్నారు. అల్లూరి జిల్లా షెడ్యూల్డ్ ప్రాంతానికి ఏమాత్రం సంబంధం లేని కుంభ రవిబాబుకు ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి కట్టబెట్టింది అభివృద్ధి చెందిన ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేలా నివేదిక ఇవ్వడానికా? అసలైన గిరిజనులకు మనుగడ లేకుండా చేయడానికా అని ప్రశ్నిస్తున్నారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేలా నివేదిక ఇవ్వడం తమను మోసం చేయడానికేనని గిరిజనులు రగిలిపోతున్నారు.

నేటినుంచి జీ-20 సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ పరుగులు పెడుతున్న వేళ జీ-20 దేశాల ఐక్యత ప్రాధాన్యత సంతరించుకుంది. జీ-20లో అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, భారత్, యూరోపియన్ యూనియన్, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, రష్యా, మెక్సికో, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, బ్రిటన్, దక్షిణ కొరియా, అమెరికా దేశాలు ఉన్నాయి. ప్రపంచ జీడీపీలో 85 శాతం ఈ 20 దేశాలే కలిగి ఉన్నాయి. ప్రపంచ వాణిజ్య వ్యాపారాల్లో జీ-20 దేశాలు 70 శాతం తమ గుప్పెట్లో పెట్టుకున్నాయి. ప్రపంచ ఆర్థిక సుస్థిరత, సంతులిత అభివృద్ధి సాధించేందుకు సభ్యదేశాల మధ్య సమన్వయం కల్పించేదుకే ఏటా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు. 2023 సెప్టెంబర్‌లో జీ 20 సదస్సు దిల్లీలో జరుగుతుంది. దీనికి భారత ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షత వహిస్తారు. దీనికి ముందు దేశంలోని ప్రధాన నగరాల్లో సన్నాహక సమావేశాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం నుంచి రెండు రోజులపాటు విశాఖలో జీ-20 సదస్సు జరగనుంది. మూడు నెలలుగా రూ.150 కోట్లతో విశాఖ నగరాన్ని, ప్రత్యేకించి సాగర తీరాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దారు. 20 దేశాల నుంచి 150 మంది ప్రతినిధులు విశాఖ వస్తున్నారు. ఇందుకోసం అధికారులు అకుంఠిత దీక్షతో శ్రమించారు. విశాఖ కీర్తిని మరింత పెంచేందుకు హంగులు, రంగులతో జీ-20 వేడుకలకు ఆరుప్రాంతాల్లో వేదికలను ముస్తాబు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంగళవారం సాయంత్రం విశాఖకు చేరుకుంటారు. 2500 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ భద్రత ఏర్పాట్లు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ వెల్లడించారు. పర్యాటకులకు మూడు రోజులపాటు సాగర తీరంలో ప్రవేశం లేదని అధికారులు స్పష్టంచేశారు.

రేపటి ఆర్థిక నగరాలే లక్ష్యం: ఆరోఖ్య రాజ్

రేపటి ఆర్థిక నగరాలే లక్ష్యంగా విశాఖలో జీ-20 సదస్సు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్య రాజ్ స్పష్టం చేశారు. ఈ నెల 28 నుంచి జరగనున్న సదస్సు విశేషాలు, ముఖ్యాంశాలను నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో మీడియాకు సోమవారం ఆయన వివరించారు. జీ-20 తొలి సదస్సు పూనెలో జరగ్గా రెండో సదస్సు విశాఖలో జరుగుతోందన్నారు. మొత్తం 8 సెషన్లల్లో తొలిరోజు నాలుగు, రెండో రోజు మిగతావి ఉంటాయన్నారు. 28న సీఎం జగన్ హాజరై ప్రతినిధులతో పరిచయం... అనంతరం గాలా డిన్నర్‌లో పాల్గొంటారన్నారు. సదస్సుకు జీ-20 దేశాల ప్రతినిధులతో పాటు మరికొన్ని ఆహ్వాన సంస్థలు, ఏడీబీ, వరల్డ్ బ్యాంక్‌కు సంబంధించిన 63 మంది ప్రతినిధులు తమ పేర్లు నమోదు చేసుకోగా ఇప్పటికే 57 మంది విశాఖ చేరుకున్నారన్నారు.

మౌలిక సదుపాయాల కల్పన కోసం...

ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాల్లోనూ 50 శాతం మంది పట్టణాల్లోనే నివసిస్తున్నారని, దీనివల్ల 80 శాతం జీడీపీ సాధిస్తున్నామని, 2050 నాటికి పట్టణాల్లో 70 శాతం ప్రజలు నివసించే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆరోఖ్య రాజ్ తెలిపారు. అందువల్ల పట్టణవాసులకు మౌలిక సదుపాయాలు కల్పించడం, భవిష్యత్తులో ఇంకెన్ని పెట్టుబడులు అవసరం అనే అంశాలపై నిపుణులు తమ సలహాలు చెబుతారన్నారు. ఈ నెల 30న అతిథులతో పాటు కేంద్రం నుంచి మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సహా మరికొంతమంది ప్రతినిధులు శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కొరియా, సింగపూర్ వంటి దేశాల ప్రతినిధులు...తమవద్ద విజయవంతమైన ప్రాజెక్టుల గురించి చెబుతారన్నారు. ఆఖరి రోజున దేశవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అధికారులు, విద్యార్థులు, వైస్ చాన్సలర్లు, ప్రిన్సిపాల్స్ తదితరులు విచ్చేసి విదేశీ ప్రతినిధులతో సహృద్భావ చర్చలు జరుపుతారని, అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకుంటారని ఆరోఖ్యరాజ్ స్పష్టం చేశారు. రేపటి ఆర్థిక నగరాలు, ఆర్థికాభివృద్ధి, ఇంధన సామర్థ్యం, కాలుష్య నియంత్రణ వంటి ఎన్నో విషయాలపై సుదీర్ఘ చర్చలుంటాయన్నారు. ఆర్థిక శాఖ నిపుణులు అమన్ గార్గ్, జితేంద్రసింగ్ రాజీ పాల్గొన్నారు.

సంపాదకీయం

ఆఖరి ఆశాకిరణం

డి.వై.చంద్రచూడ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన తరవాత ఇటీవలి కాలంలో ఆయన వివిధ సందర్భాల్లో చేస్తున్న ప్రసంగాలు న్యాయ వ్యవస్థ స్వతంత్రతను పరిరక్షించే ప్రధాన న్యాయమూర్తి ఉన్నారు అన్న భరోసా కలిగిస్తున్నాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ న్యాయవ్యవస్థకు సవాళ్లు విసురుతూనే ఉన్నారు. ప్రధానంగా కొలీజియం వ్యవస్థ మీద విమర్శలు సంధిస్తున్నారు. కానీ ఇప్పుడు చట్టం ప్రకారం అమలులో ఉన్నది కొలీజియం వ్యవస్థేనని మాజీ ప్రధాన న్యాయమూర్తి యూయూ లలిత్, ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ కూడా అంటున్నారు. అనేకమంది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తుల పదవీ కాలంతో పోలిస్తే ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి పదవీ కాలం 2024 నవంబర్ 10 దాకా ఉంది. అంటే 2024లో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరవాత కూడా ఆయన కొన్ని నెలలపాటు ప్రధాన న్యాయమూర్తిగా ఉంటారు. అందువల్ల న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడడానికి ఆయన ఏ మేరకు పాటు పడతారో గమనించవలసి ఉంది. రాజకీయ ప్రభావం చూపించే అనేక వ్యాజ్యాలను సుప్రీంకోర్టు తేల్చవలసి ఉంది. ఎన్నికల బాండ్ల కేసుపై విచారణ జరగాల్సి ఉంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ అత్యుత్సాహాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఏప్రిల్ అయిదున విచారణ జరగవలసి ఉంది. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ సంస్థల విరాళాల వ్యవహారం కూడా సుప్రీంకోర్టు పరిశీలించవలసి ఉంది. మోదీ హయాంలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ధ్వంసం అవుతున్నాయి. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ప్రజాస్వామ్య సౌధం రాయి రాయి విడగొట్టడంలో మోదీ సర్కారు నిమగ్నమై ఉంది. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని దర్యాప్తు సంస్థలన్నీ మోదీ సర్కారు ఆత్మకు అనుగుణంగానే వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ కత్తి ప్రసిద్ధులైన ప్రతిపక్ష నాయకుల తలమీద వేలాడుతూనే ఉంది. ప్రభుత్వ యంత్రాంగం అధికారపక్షం అడుగులకు మడుగులొత్తడం మొదలై చాలాకాలమే అయింది. పార్లమెంటులో కార్యకలాపాలు కొనసాగడమే అబ్బురం అయిపోయింది. మీడియాలో ఎక్కువ భాగం మోదీ సర్కారు కీర్తిగానంలో తలమునకలై ఉంది. ఏపక్షం అధికారంలో ఉన్నా ప్రశ్నించే తత్వాన్ని పరిరక్షించుకోవలసిన మీడియా విచిత్రంగా ప్రశ్నలన్నింటినీ ప్రతిపక్షాలవేపే సంధిస్తోంది. న్యాయవ్యవస్థను కూడా తమ అధీనంలోకి తెచ్చుకోవాలని మోదీ సర్కారు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంది. ఈ దశలో న్యాయవ్యవస్థను పరిరక్షించే ప్రధాన న్యాయమూర్తి ఉన్నారన్న ఆశ మిణుకుమిణుకుమంటోంది.

న్యాయస్థానాలలో విచారణకువచ్చే కేసుల్లో ఎక్కువభాగం ప్రభుత్వానికి సంబంధించినవే అయిఉంటాయి. అలాంటి స్థితిలోనూ రాజ్యాంగ నిర్దేశాలను పాటిస్తూ అవసరమైతే ప్రభుత్వ పక్షాన్ని గట్టిగా నిలదీసే బాధ్యత సుప్రీంకోర్టుకు ఉంది. లేకపోతే ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుంది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజకీయ పక్షాలు, ముఖ్యంగా ప్రతిపక్షాలు పోరాడడం ఒక ఎత్తు. రాజ్యాంగాన్ని, ప్రజల హక్కులను సుప్రీంకోర్టు ఏ మేరకు పరిరక్షిస్తోంది అన్నది మరో ఎత్తు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రజల హక్కుల పరిరక్షణ గురించి గట్టిగానే మాట్లాడారు. ఆయన మాటలు అధికార పక్షం గొంతులో పచ్చి వెలక్కాయలా తయారయ్యాయి. చట్టబద్ధ పాలన గత చరిత్ర పుటల్లో కలిసిపోయే స్థితిలో ఉంది. విమానమెక్కిన కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరాను విమానంలోంచిదింపి మరీ అరెస్టు చేశారు. కానీ సుప్రీంకోర్టు మూడు గంటల వ్యవధిలోనే ఆయనను నిర్బంధించడానికి వీలులేదని చెప్పింది. అంతే కాకుండా పవన్‌ఖేరా మీద దాఖలైన ఎఫ్.ఐ.ఆర్.పై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్, అసోం ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారం ఇంకా ముగియలేదు. కానీ న్యాయం ఇంకా మిగిలే ఉందన్న ఆశా కిరణం కనిపించింది. కానీ ఇంతకు ముందు బెయిలు ఇవ్వడానికి చాలా ఉదంతాలలో విముఖంగా ఉన్న సుప్రీంకోర్టు ఇప్పుడు కాస్త ఉదారంగానే బెయిలు మంజూరు చేస్తోంది. గత పది పన్నెండు రోజులలో ప్రధాన న్యాయమూర్తి నాలుగు చోట్ల ప్రసంగించారు. ప్రతిచోటా భావ ప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛగురించి మాట్లాడారు. పౌర హక్కులను ప్రభుత్వం అణచివేయకూడదనీ హెచ్చరించారు. దాపరికంలేని విధానం గురించీ చర్చకు తెరలేపారు. రంజన్ గొగోయ్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు కీలకాంశాలన్నింటిపై ప్రభుత్వ వైఖరి ఏమిటో సీల్డ్ కవర్లో అందిస్తే వాటన్నింటినీ అంగీకరించేవారు. రాఫేల్ యుద్ధ విమానాల కొనుగోలులో అవినీతి జరిగిందన్నప్పుడు అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ చేసిన పని సీల్డ్ కవర్‌ను అంగీకరించడమే. దానికి తోడు రాఫేల్ వ్యవహారం దేశ భద్రతకు సంబంధించిందని ప్రభుత్వం వాదిస్తే గొగోయ్ నోరు మెదపకుండా ఒప్పేసుకున్నారు. చంద్రచూడ్ ఈ పద్ధతిని నిరాకరించారు. సీల్డ్ కవర్‌లో సమాచారం ఇస్తే నిర్దిష్ట వ్యాజ్యంలో ప్రభుత్వ వైఖరి ఏమిటో ఆ వ్యాజ్యంతో సంబంధం ఉన్న అవతలి పక్షానికి సమాచారం ఎలా అందుతుంది అని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నిలదీశారు.

2015లో కేంద్ర ప్రభుత్వం న్యాయమూర్తుల నియామకంకోసం జ్యుడీషియల్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం బిల్లు తీసుకొచ్చింది. పార్లమెంటు ఉభయసభలూ దీన్ని ఆమోదించాయి. రాష్ట్రపతి సంతకం కూడా చేసినందువల్ల దానికి చట్ట ప్రతిపత్తి వచ్చింది. ఆ సమయంలో ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న కేహార్ హయాంలోఈ న్యాయమూర్తుల నియామక కమిటీ చెల్లదని తీర్పు చెప్పేశారు. అప్పటినుంచే మోదీ ప్రభుత్వం సుప్రీంకోర్టు మీద కత్తి కట్టినట్టు ప్రవర్తించడం మొదలైంది. అలాంటి బిల్లు మళ్లీ తీసుకొచ్చే ఉద్దేశం ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు చెప్పలేదు. కానీ కొలీజియం వ్యవస్థను తూర్పారబట్టడం మాత్రం మానలేదు. అయితే కేంద్ర ఎన్నికల కమిషనర్లను నియమించే విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మోదీ సర్కారుకు కళ్లెం వేసింది. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి మూలకందం అయినప్పుడు ఎన్నికల కమిషన్ అధిపతులను ప్రభుత్వం తనంత తాను నియమిస్తే ఆ కమిషన్ కు స్వేచ్ఛ ఎక్కడి నుంచి వస్తుంది అని ప్రశ్నించింది. అందుకే ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎన్నికల కమిషన్ అధిపతులను నియమించాలని కరాఖండిగా చెప్పింది. ఇది మోదీ గుండెలో శూలంలా దిగింది. ఈ మధ్య కాలంలో సుప్రీంకోర్టు కొలీజియం న్యాయమూర్తులుగా నియమించడానికి 12 పేర్లు సూచిస్తే కేంద్ర ప్రభుత్వ ఎనిమిదిమంది నియామకాన్నే ఖరారు చేసింది. అలాగే 35 పేర్లు హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించడానికి సిఫార్సు చేస్తే అందులో అయిదుగురి పేర్లను ప్రభుత్వం తొక్కి పెట్టింది. కొలీజియం వీలైనంత దాపకరికం లేకుండా పనిచేయడానికి ప్రధాన న్యాయమూర్తి పాటుపడుతున్నారు. ఒక ర్యాంకు ఒకే పింఛన్ అన్న సైనికుల వ్యవహారంలో కూడా సీల్డ్ కవర్లో సమాచారం ఇవ్వడాన్ని చంద్రచూడ్ ఆమోదించలేదు. తన పదవీకాలం ముగిసేదాకా ప్రధాన న్యాయమూర్తి ఇలాగే వ్యవహరిస్తే ప్రజాస్వామ్య సౌధంలో ఒక్క స్తంభం అయినా పదిలంగా ఉందన్న భరోసా ఉంటుంది.

పోలవరం ఎత్తు తగ్గితే, అపార నష్టం



రావుల వెంకయ్య

అత్యంత ప్రాధాన్యత కలిగిన పోలవరం ప్రాజెక్టు ఎత్తును 150 అడుగుల నుండి 135 అడుగులకు అంటే 45.72 మీటర్ల నుండి 41.15 మీటర్లకు తగ్గించడం ద్వారా రాష్ట్ర ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టం కలుగచేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలపై నీళ్ళు చల్లినట్లుగా ఈ చర్య ఉన్నది. ఒకరిపై ఒకరు చెప్పుకొని రాష్ట్ర ప్రజానీకానికి ద్రోహం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలదీయలేక సాగిలపడుతున్నది. అన్ని రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నది. పార్లమెంటులో 28 మంది యం.పి.ల మద్దతు ఉన్నా కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోతున్నది.

పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి. ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్రంలోని 26 జిల్లాలకు ఉపయోగపడే ప్రాజెక్టు. 7 లక్షల 20 వేల ఎకరాలకు సాగునీరు, 40 లక్షల మందికి పైగా తాగునీరు విశాఖ పట్నానికి చెందిన వివిధ పరిశ్రమలకు నీరు అందించడం జరుగుతుంది. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చెయ్యడం ద్వారా యావత్ రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుంది. కృష్ణా, గోదావరి జిల్లాల్లోని సాగును క్రమబద్ధీకరించడం జరుగుతుంది. నిత్యం కరువు కాటకాలకు గురయ్యే వెనకబడిన రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు చెందిన ప్రాజెక్టులకు నికర జలాలు అందించటానికి ఆధారమౌతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ప్రాజెక్టు బహుళార్థ సాధక ప్రాజెక్టు.

నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ 2014లో రాష్ట్ర విభజన చట్టం ప్రకారం పార్లమెంటు సాక్షిగా ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి కేంద్రం 90%, రాష్ట్రం 10% ఖర్చు భరించాలని నిర్ణయించడం జరిగింది. తదుపరివచ్చిన ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ఎటువంటి అడ్డంకులు లేకుండా ఉండటానికి తెలంగాణాకు చెందిన 7మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చెయ్యడం జరిగింది. ఈ 7 ముంపు మండలాల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉన్నది. ఈ మండలాల్లో 2 లక్షల ఎకరాలకు పైగా పంట భూములు నీట మునుగు తున్నాయి. 2 లక్షలకు పైగా కుటుంబాలవారిని వేరేచోటకు తరలించాల్సిన అవసరం ఏర్పడింది. తద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి లేకుండా పోయింది. వారికి ఆర్.ఆర్. ప్యాకేజీ ద్వారా నష్టపరిహారం, ఇండ్ల నిర్మాణం, యువకులకు ఉద్యోగ కల్పన తదితరాలకు 33 వేల కోట్లకు పైగా నిర్వాసితులకు ఖర్చు అవుతుందని నిపుణులు అంచనా వేశారు. గత ప్రభుత్వంలో ఒక ఎకరానికి 1లక్షా 15 వేల రూపాయలు నష్టపరిహారంగా చెల్లించారు. తదుపరి వచ్చిన ప్రభుత్వం 10 లక్షలకు పైగా పెంచడం జరిగింది. మొదట తీసుకున్న వారికి ఇది వర్తించదన్నారు. అందువల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురౌతున్నారు. పునరావాసం కల్పించిన గ్రామాల్లో కూడా కనీసఅవసరాలు కానీ, ఉపాధిపనులు కానీ కల్పించ నందువల్ల ఇది నిర్వాసితులకు ప్రధాన సమస్యగా ముందుకు వచ్చింది.

2010-11 సంవత్సరాల వ్యయ అంచనాల ప్రకారం ప్రాజెక్టు వ్యయం 16 వేల కోట్లుగా లెక్కించారు. 2013-14 నాటికి 33 వేల కోట్లకు పెరగగా ఇప్పుడది 56 వేల కోట్లకు చేరింది. దీనిని కేంద్రానికి చెందిన డి.పి.ఆర్. ఆమోదించడం జరిగింది. రాష్ట్రప్రభుత్వం 5,600 కోట్లు ఖర్చు పెట్టినందువల్ల ఇకనుండి అయ్యే మొత్తం ఖర్చును నూటికి నూరుశాతం కేంద్రమే భరిస్తుందని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పుడు నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక అడ్డంకులు కల్పిస్తున్నది. విద్యుత్ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చును భరించలేమంటున్నారు. నిర్వాసితుల ఖర్చు మినహాయిస్తున్నారు. ప్రాజెక్టు వ్యయం 56 వేల కోట్ల నుండి 30 వేల కోట్లకు కుదించడం జరిగింది. ఇప్పుడు ఏకంగా ఎత్తును 45.72 మీటర్ల నుండి 41.15మీటర్లకు తగ్గించనున్నారు. దానివల్ల ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 190 టియంసిల నుండి 80 టియంసిలకు పరిమితం చేస్తామంటున్నారు. అలాగే 41.15 మీటర్ల లోపు మునిగే ప్రాంతాలలో వున్న నిర్వాసితులకు మాత్రమే చెల్లిస్తామంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును ఎత్తు తగ్గించబోమని 45.72 మీటర్లు కడతామని, కానీ నీటి నిల్వను 41.15కు పరిమితం చేస్తామంటున్నారు. మిగిలింది తర్వాత పూర్తిచేస్తామంటున్నారు. ఈ విషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తోడుదొంగలుగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రజల ఆశలను అడియాసలుగా చేస్తున్నారు.

రాష్ట్ర వ్యాపితంగా 26 జిల్లాలకు ఉపయోగపడే ప్రాజెక్టును రక్షించుకోవాల్సిన అవసరం రాష్ట్ర ప్రజలందరిపై ఎంతైనా ఉన్నది. రాజకీయాల కతీతంగా యావత్ రాష్ట్ర ప్రజలు ఒక తాటిపై వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడాలి. దానికోసం రైతులు, వివిధ వర్గాల ప్రజలు అందరూ కలిసి బలమైన ఐక్య ఉద్యమానికి ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

ఎఐకెఎస్ అధ్యక్షుడు

దేశానికి రానున్నవి చీకటి రోజులు

జస్టిస్ మార్కండేయ కట్జూ

నాజీ జర్మనీకి, బీజేపీ భారత్‌కూ పోలికలు చూపుతూ సరిగ్గా జర్మనీలో జరిగినట్టుగానే, అసలు సమస్యలనుంచి దృష్టి మళ్లించడానికి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని అంటున్నారు జస్టిస్ మార్కండేయ కట్జూ. భారతదేశంలో జరుగుతున్న సంగతులు నాకు నాజీల కాలంలో జర్మనీలో జరిగిన సంగతులను గుర్తుకు తెస్తున్నాయి. జనవరి 1933లో హిట్లర్ అధికారానికి వచ్చిన తర్వాత యావత్తుజర్మనీ ఉన్మాదంలో పడిపోయింది. ఎక్కడ చూస్తే అక్కడ జనం 'హెయిల్ హిట్లర్' అనీ 'సీగ్ హెయిల్' అనీ 'యుడెన్ వెరెక్కె' అనీ అరవడం, మత్తెక్కిన మరబొమ్మల్లాగ ఆ పిచ్చివాణ్ణి ప్రశంసించడం చేశారు. మీకు కావాలంటే ఆ దృశ్యాలన్నీ యూట్యూబ్ మీద చూడవచ్చు. జర్మన్లు ఎంత ఉన్నతమైన సంస్కృతీపరులంటే వారు మాక్స్ ప్లాంక్, ఐన్‌స్టీన్ వంటి గొప్ప శాస్త్రవేత్తలను, గోథె, షిల్లర్ వంటి మహా రచయితలను, హీనె వంటి మహా కవులను, మొజార్ట్, బాక్, బీథోవెన్ వంటి మహా సంగీత విద్వాంసులను, మార్టిన్ లూథర్ వంటి గొప్ప సంస్కర్తలను, కాంట్, నీషే, హెగెల్, మార్క్స్ వంటి గొప్ప తత్వవేత్తలను, లీబ్నిట్జ్, గాస్, రీమన్ వంటి గొప్ప గణితశాస్త్రజ్ఞులను, ఫ్రెడరిక్ ది గ్రేట్, బిస్మార్క్ వంటి గొప్ప రాజనీతిజ్ఞులను కన్న నేల అది. నేను కలిసిన ప్రతి ఒక్క జర్మన్ కూడ ఎంతో ఉత్తములు. అయినప్పటికీ, రంగస్థలం మీదికి హిట్లర్ వచ్చాక, జర్మన్లే ఉత్తమ పాలక జాతి అని, వారి సమస్యలన్నిటికీ బాధ్యులు యూదులే అని ప్రకటించాక, జర్మన్లు ఆ పిచ్చిప్రేలాపనలను నమ్మడం మొదలుపెట్టారు. యూదులమీద జరిగిన అత్యాచారాలకు, చివరికి జరిగిన మహామారణ కాండకు వారు ఎదురుచెప్పలేదు. బహుశా దాన్ని సమర్థించి ఉంటారు కూడ.

అలా ఎలా జరిగింది? కచ్చితంగా జర్మన్ ప్రజలందరూ మూర్ఖులేమీ కాదు. అంతరాంతరాళల్లో దుర్మార్గులేమీ కాదు. అన్ని దేశాల, అన్ని మతాల, అన్ని నరజాతుల, వగైరా అన్ని సమూహాల ప్రజల్లో 99 శాతం మంచివాళ్లేనని నా ప్రగాఢ నమ్మకం. మరి అరవై లక్షల మంది యూదులను గ్యాస్ చాంబర్లలోకి పంపి మూకుమ్మడిగా హత్య చేయడానికి జర్మన్లకు చేతులెలా వచ్చాయి? నా ఉద్దేశంలో దానికి కారణమేమంటే, మహా శక్తిమంతమైన ఆధునిక ప్రచారసరళి అత్యంత సంస్కృతీపరుల, ఆలోచనాపరుల మెదళ్లలో కూడ విషం నింపగలదు. ఎక్కువమంది జర్మన్ల విషయంలో జరిగిందదే. మొదటి ప్రపంచ యుద్ధంలో ఓటమి తర్వాత జర్మన్లలో నిండిన నిరాశా నిస్పృహలు, 1929 మహాసంక్షోభం తర్వాత పెద్దఎత్తున వ్యాపించిన నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థికసంక్షోభం హిట్లర్ వంటి దుర్మార్గుడి విషప్రచారానికి సులభంగా దొరికిన ఆయుధాలు. ఆ విషప్రచారాన్ని జర్మన్లు మొత్తానికి మొత్తంగా అక్షరం వదలకుండా మింగి తమ మెదళ్లలో నింపుకున్నారు.

ఇవాళ అత్యధిక భారతీయుల విషయంలో అదే జరుగుతున్నది. అభివృద్ధి నిరోధక, హిందూ నయాఫాసిస్టు పార్టీ భారతీయ జనతా పార్టీ 2014లో అధికారానికి వచ్చినప్పటి నుంచి భారతీయ మైనారిటీలకు(ప్రత్యేకంగా ముస్లింలకు) వ్యతిరేకంగా భారీ మతోన్మాద ప్రచారానికి తెరలేపింది. ఆవులను చంపుతున్నారనీ, హిందూ బాలికలకు వల వేస్తున్నారనీ, వగైరా విద్వేషం నిండిన ఉపన్యాసాలతో చాలమంది హిందువుల మనసులను విషపూరితం చేశారు. రామాలయం నిర్మించాలనే ప్రకటనలూ, ముస్లింలను కొట్టి చంపడమూ గత కొద్ది సంవత్సరాలలో సర్వసాధారణమైపోయాయి. పాకిస్తాన్‌లోని బాలాకోట్‌మీద వైమానికదాడి, సానుకూలమైన భారత ప్రచార సాధనాల ద్వారా యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టడం కూడ ఈ దండయాత్రలో భాగమే. ఈ ప్రయత్నమంతా ఇటీవలి పార్లమెంటరీ ఎన్నికలలో భారతీయ జనతాపార్టీకి కనీవినీ ఎరగని ఘనవిజయం చేకూర్చడం ద్వారా అనుకున్న ఫలితాలను సాధించింది. భారతదేశంలోని ఏ ఒక్క నిజమైన సమస్యనూ పరిష్కరించలేని గారడీచర్యగా అధికరణం 370రద్దు, దుష్ట పాకిస్తాన్‌మీద సాధించిన మహా విజయంగా, ఉత్సవసందర్భంగా చాల మంది హిందువులను మరింత ఉన్మాదులుగా మార్చింది. అమెరికాలోని హ్యూస్టన్‌లో హౌడీ మోదీ ప్రదర్శన దీనికి ఒక సాక్ష్యం.

కనీ వినీ ఎరగని స్థాయిలో నిరుద్యోగం (స్వయంగా భారత ప్రభుత్వ సంస్థ నేషనల్ శాంపిల్ సర్వే వెల్లడించింది), దారుణమైన శిశు పోషకాహార లోపం (దేశంలోని ప్రతి ఇద్దరు పిల్లల్లో ఒకరు పోషకాహార లోపం) పెద్ద సంఖ్యలో రైతుల ఆత్మహత్యలు(మూడు లక్షలకు పైగా), అందని సరైన ఆరోగ్య సౌకర్యాలు, నాణ్యమైన విద్య, ధనికులకూ, పేదలకూ మధ్య పెరుగుతున్న అంతరం (దేశంలోని 135 కోట్ల జనాభాలో సగం మంది దగ్గర ఉన్న సంపద కన్న ఎక్కువ సంపద ఏడుగురు భారతీయుల దగ్గరే ఉంది) వంటి భారతదేశంలోని నిజమైన సమస్యలలో ఏ ఒక్కటీ ఇటీవలి లోకసభ ఎన్నికలలో చర్చకే రాలేదు. లౌకిక వాదమనేది ఉత్తర అమెరికా, యూరప్‌ల వంటి పారిశ్రామిక సమాజాల లక్షణం. అది ఆసియా దేశాలలో అత్యధికంగా ఉన్న భూస్వామ్య, అర్ధభూస్వామ్య సమాజాల లక్షణం కాదు. రాజ్యాంగంలో ఆ మాట ప్రస్తావించినంత మాత్రాన దేశం లౌకిక దేశం అయిపోదు. భారతదేశం ఇంకా అర్ధభూస్వామ్యమేననేది ఈ సమాజంలో విస్తృతంగా ఉన్న కులతత్వం, మతతత్వం రుజువు చేస్తున్నాయి. భారతీయులలో అత్యధికులు లోలోతులనుంచి మత విశ్వాసాలు కలవాళ్లు. భారతీయులలో దాదాపు 80శాతం హిందువులు గనుక వారు అతి సులభంగా మతోన్మాద ప్రచారానికి గురికాగలరు.

భారతదేశంలో హిందువులు, ముస్లింలలోనూ అత్యధికులు మతతత్వానికి గురైనవాళ్లే. నా చిన్నతనంలో నా హిందూ బంధువులూ మిత్రులూ చాల మంది ముస్లింల మీద విషం కక్కుతుండడం నేనుచూశాను. కాకపోతే వాళ్లు అలా మాట్లాడుతున్నప్పుడు పక్కన ముస్లింలేకుండా చూసే జాగ్రత్త తీసుకునేవారు. ఇవాళ ఒక ముస్లింను కొట్టి చంపేశారంటే చాలమంది హిందువులకు అది పట్టడమే లేదు. బహుశా కొందరు సంతోషిస్తున్నారేమో కూడ. ఒక తీవ్రవాది తగ్గాడని అనుకుంటున్నారేమో! మైనారిటీలపై ప్రత్యేకించి ముస్లింలపై విద్వేషరూపంలో మతోన్మాదం చాలమంది హిందువులలో పైకి కనబడకుండా ఎప్పుడూ ఉంటూనేఉంది. ఎక్కడో ఒకచోట నిప్పురవ్వపడితే పేలిపోయే మందుపాతరలాగ అది వేచి చూస్తూ ఉండింది. 2014 నుంచి 2019 వరకూ ఆ మతోన్మాద మంటలను భారతీయ జనతాపార్టీ ఎగసన దోస్తూ వచ్చింది. ఈ పార్టీ మీద ఆధిపత్యం వహిస్తున్నది భయంకరమైన ముస్లిం వ్యతిరేక, క్రైస్తవ వ్యతిరేక మతోన్మాద సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్.

ఇప్పుడిక భారతీయ జనతా పార్టీ, దాని నాయకుడు మోదీ అసాధారణ విజయం సాధించారు గనుక, ప్రజల వైపు నుంచి తమ సమస్యలు పరిష్కరించే పాలన ఇమ్మని ఒత్తిడి పెరుగుతుంది. అంటే ఉద్యోగాలు కల్పించమనీ, రైతుల నిస్సహాయస్థితిని మెరుగుపరచమనీ, శిశు పౌష్టికాహార లోపాన్ని తగ్గించమనీ, మంచి ఆరోగ్యసేవలు అందించమనీ, నాణ్యమైనవిద్య అందించమనీ, వగైరా ఆకాంక్షలు పెరుగుతాయి. కాని ఈ పాలకులకు ఆ పరిష్కారాలు ఎలా సాధించాలో తెలియదు. అంతేకాదు, పరిష్కరించకపోవడం మాత్రమే కాదు, దేశంలో ప్రస్తుతం ఆర్థికస్థితి మరింతగా దిగజారింది. జాతీయాదాయ పెరుగుదల రేటు ఒక్కసారిగా 5శాతానికి పడిపోయింది. వాహనాల తయారీరంగం సహా పారిశ్రామిక ఉత్పత్తులలో, రియల్ ఎస్టేట్, విద్యుచ్ఛక్తి ఇటువంటి మరెన్నో రంగాలలో పతనం కనబడుతున్నది. మున్నన్నడూ లేనంత నిరుద్యోగం తలెత్తడం మాత్రమే కాదు, అది ఇంకా పెరుగుతున్నది. సరిగ్గా హిట్లర్ యూదులు అనే బలిపశువును కనిపెట్టినట్టుగా. భారతదేశంలో అటువంటి బలిపశువు ముస్లింలు. ముస్లింల మీద అత్యాచారాలు ఇంకా పెరుగుతాయనీ, తక్కువగా క్రైస్తవుల మీద కూడ పెరుగుతాయనీ నాకు భయం కలుగుతున్నది. సరిగ్గా నాజీ పాలనాకాలంలో జర్మనీలో విజ్ఞానశాస్త్రాన్ని ఎట్లా జాత్యహంకార పూరితమైన అర్థరహిత ప్రేలాపనగా మార్చారో, భారతదేశంలో కూడ 2014 తర్వాత విజ్ఞానశాస్త్రాన్ని అట్లాగే మార్చారు. నాజీ జర్మనీలో చరిత్రను ఎట్లా వక్రీకరించారో, 2014 తర్వాత భారతదేశంలో కూడా అట్లాగే వక్రీకరిస్తున్నారు. సరిగ్గా జర్మన్ ప్రచార సాధనాల మీద గోబెల్స్ ఆధిపత్యం చలాయించినట్టుగానే, భారత ప్రచారసాధనాలు కూడ వంగిపోయి, లొంగిపోయి, 'సర్వంసహా చక్రవర్తి'కి ప్రణామాలు పలుకుతున్నాయి. దేశానికిక రానున్నవి చీకటిరోజులే.

(రచయిత సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షులు)

తెలుగు అనువాదం : ఎన్. వేణుగోపాల్

భీతిగొల్పుతున్న ఆర్థికసంక్షోభం

డా. సోమ మర్ల

అమెరికా, ఐరోపాల్లో బ్యాంకులు వరుసగా కుప్పకూలి పోతూ ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఏర్పడవచ్చునని భీతి చెందుతున్నారు. అమెరికాలో మొదట సిలికాన్ వ్యాలి బ్యాంకు (ఎస్‌వీబీ), ఆ తర్వాత సిగ్నేచర్ బ్యాంకు, క్రెడిట్‌సూయిస్‌లు, తాజాగా అతి పెద్ద యూరోపియన్ క్రెడిట్ డచ్ బ్యాంకు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయి. అమెరికాలో ఇటీవల వడ్డీరేట్లు పెంచడంతో బ్యాంకుల్లో ఆర్థికసంక్షోభం తలెత్తింది. అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థ బీటలు వారడంతో 2008లో వలెనే ప్రపంచవ్యాప్తంగా అంటువ్యాధిలాగా ఆర్థిక సంక్షోభం రావచ్చునన్న భయాందోళనలు విస్తరించాయి. 2008లో లేమన్‌బ్రదర్స్ ఆర్థికంగా నిలువులోతుల్లో కూరుకుపోయింది. దీని పర్యావసనాలు త్వరలో భారత ఆర్థికవ్యవస్థపైన ప్రభావం చూపనున్నాయి. గత దశాబ్దికాలంలో ఉత్పాదరహిత ద్రవ్య ఆర్థిక పెట్టుబడులు నిల్వఉండటంవల్ల ఆర్థిక నియమాలను ఉల్లంఘించి పరిమితికిమించి నోట్లను ముద్రించడం నేడు ఆర్థిక సంక్షోభానికి దారితీసింది. అమెరికా ఫెడరల్ బ్యాంక్ వ్యవస్థ వడ్డీరేట్లను దాదాపు వడ్డీలేని స్థాయికి తగ్గించింది. ప్రజలు తమ వద్దగల అదనపు డబ్బును ఎస్‌వీబీ లాంటి చిన్న, మధ్యతరహా బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు. ఫలితంగా అమెరికా బ్యాంకుల్లో డిపాజిట్లు 13 ట్రిలియన్ డాలర్ల నుంచి 18 ట్రిలియన్ డాలర్లకు అపారంగా పెరిగాయి. రుణాలు తీసుకొని పరిశ్రమలద్వారా ఉత్పత్తి పెంచేవారు తగ్గడంతో చిన్న, మధ్య తరహా బ్యాంక్‌లు, స్టార్టప్‌లు, క్రిప్టో కరెన్సీలు, కొనుగోళ్లకు అప్పులిచ్చాయి. మిగులుగాఉన్న డబ్బుతో అమెరికా ఫెడరల్ సెక్యూరిటీ బాండ్లను కొనుగోలు చేశాయి. ప్రభుత్వం జారీచేసే బాండ్ రుణానికి హామీగా ఉంటుంది. నిధుల వ్యయానికి, కర్తవ్యాలు నెరవేర్చేందుకు ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుంది. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో ద్రవ్యోల్బణం పెరుగుదలను నిలువరించేందుకు ఫెడరల్ బ్యాంకు వడ్డీరేట్లను పెంచింది. ఫలితంగా బాండ్ల విలువ పడిపోయింది. ఫెడరల్ వడ్డీరేట్లు పెరగడంలో ఎస్‌విబి బాండ్ల విలువ మార్కెట్‌లో తగ్గిపోయింది. ప్రతి 25 బేసిక్ పాయింట్లు లేదా 0.25శాతం పాయింట్ల ఆధారంగా బాండ్ల విలువ బిలియన్ డాలర్లు పడిపోయింది. ఫెడరల్ ఫండ్స్ రేటు ఇప్పుడు 450 బేసిక్ పాయింట్లకు పెంచారు. ఎస్‌విబి కుప్పకూలిన తర్వాత ప్రస్తుతం బ్యాంకు కేవలం 42 బిలియన్ డాలర్లపై నడుస్తున్నది. దీనితో ఎస్‌విబి తర్వాత సిగ్నేచర్, సూయిజ్ క్రెడిట్, ప్రపంచవ్యాప్తంగా ఇతర బ్యాంకులు సంక్షోభంలో పడిపోయాయి.

ఫెడరల్ బాండ్లకు అమెరికా యుద్ధపరిశ్రమలో వాటి ఆర్థిక పెట్టుబడులకు మధ్య సహజమైన అవినాభావ సంబంధం ఉంది. ఇటీవలికాలంలో జరుగుతున్న ఉక్రెయిన్ యుద్ధంలాంటి "యుద్ధక్రీడల్లో" ఫెడరల్ బాండ్ల రూపంలో పెట్టుబడులు పెరిగాయి. ప్రస్తుతం బుడగపేలిపోయింది. స్టార్టప్‌లు ఆగిపోతున్నాయి. కొనసాగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి అనేక బిలియన్ డాలర్లు సహాయం చేసేందుకు ఫెడరల్ బాండ్లను వినియోగించు కుంటున్నారు. ఇది ప్రస్తుత బ్యాంకుల సంక్షోభానికి దారితీసింది. ఉత్పాదకరంగంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా సమాజంలో సంపద పెరుగుతుంది కానీ ఆయుధాల ఉత్పత్తి ద్వారా, స్పెక్యులేషన్ లేదా స్టాక్ మార్కెట్ల ద్వారా సంపద పెరగదు. ఇవన్నీ ఉత్పాదకరహితమైనవి. సమాజంలో వీటికి విలువలేదు. ప్రస్తుతం అమెరికా ఆర్థికవ్యవస్థలో పెరిగిపోతున్న ద్రవ్యోల్బణాన్ని కట్టడిచేసేందుకు ఫెడరల్ వ్యవస్థ వడ్డీరేట్లను పెంచింది. ఫలితంగా బాండువిలువ

పడిపోయింది. చిన్న, మధ్యతరహాబ్యాంకుల సంపద అపారంగా తగ్గిపోయింది. బ్యాంకులన్నీ కుప్పకూలి పోతాయన్న భయంతో డిపాజిట్‌దారులు తమ డబ్బును తీసుకునేందుకు బ్యాంకుల వద్ద క్యూ కట్టారు. డిపాజిట్ దారులకు ప్రభుత్వం భద్రత కల్పిస్తుందని దేశ అధ్యక్షుడు బైడెన్ హామీ ఇచ్చినప్పటికీ సంక్షోభం ఇంకా ముదురుతోంది. ప్రస్తుతం ఆందోళనకరమైనస్థాయిలో ఈ సంక్షోభం ఐరోపా బ్యాంకులకు విస్తరించింది.

భారత ఆర్థికవ్యవస్థపై ప్రభావం: భారత ఆర్‌బీఐ అమెరికాలో సెక్యూరిటీలలో పెట్టిన పెట్టుబడులు ఆగస్టులో 9.2 బిలియన్ డాలర్ల నుంచి 2022నాటికి 2021.2 బిలియన్ డాలర్లకు పెరిగాయి(ఈటీఐజీ, డాటా, టీఓఐ, 2022, ఆగస్టు 24వ తేదీ). రిస్క్ తీసుకునేందుకు ఇష్టపడని విదేశీ పెట్టుబడి దారులు ప్రస్తుత ఆందోళన తెలిపే పరిస్థితుల్లో సురక్షిత మార్గాలను ఎంచుకుంటారు. మన దేశంలో ఎఫ్‌డీఐలపై ఇది తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుంది. మన స్టాక్ మార్కెట్లనుండి విదేశీ పెట్టుబడిదారులు పశ్చిమ దేశాల బ్యాంకుల్లో పెట్టుబడులు పెట్టేందుకు వెళ్లిపోతారు. దీని ఫలితంగా మన రూపాయివిలువ మరింత పడిపోతుంది. సురక్షితమార్గాలకోసం చూసే ధనికులు బంగారం కొనుగోళ్లు చేస్తున్నారు. మనదేశ బంగారం మార్కెట్‌లో బంగారం ఖరీదు పెరుగుతోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఆర్థికమాంద్యం తలెత్తవచ్చునన్న ఆందోళనతో ఎగుమతులు గణనీయంగా తగ్గిపోతాయి.

కోవిడ్ మహమ్మారి సమయంలో ఎగుమతులే మన ఆర్థికవ్యవస్థను రక్షించాయి. అమెరికా దీర్ఘకాలం మాంద్యంలో పడిపోతే మనదేశంలో పరిస్థితి మరింత దిగజారవచ్చు. అమెరికాలో వడ్డీరేట్లను మరింతపెంచితే అంతిమంగా ద్రవ్యోల్బణం ఇంకా పెరుగుతుంది. అమెరికాతో వాణిజ్య సంబంధాలు గల అన్నిదేశాలకు ద్రవ్యోల్బణం విస్తరిస్తుంది. తద్వారా మన దేశంలోనూ ద్రవ్యోల్బణం ప్రస్తుతం ఉన్న 6.5శాతం నుంచి ఇంకా పెరుగుతుంది. 4శాతానికి తగ్గించాలని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకుంది. కోవిడ్ మహమ్మారి ప్రభావం నుంచి మన ఆర్థికవ్యవస్థ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. దేశంలో ప్రైవేటు పెట్టుబడులు ఇంకా బలహీనంగానే ఉన్నాయి. (ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నిరంతరం ప్రైవేటు పెట్టుబడిదారులకు ఆర్థిక ప్రోత్సాహకాలను ప్రకటిస్తూనే ఉన్నారు). ఎగుమతులు తగ్గుతున్నాయి. దేశీయ డిమాండ్లు మరింత పడిపోతున్నాయి. అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థలో ఆందోళన ప్రకటనలు భారతదేశం సహా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థిక సంక్షోభం మరింత పెరగవచ్చు.

2008లో లేమన్ బ్రదర్స్ ఆర్థికపతనం కొనసాగించే ప్రస్తుత ఆర్థిక సంక్షోభం. పెట్టుబడీదారీవర్గాలు ఒక దశ వరకు ఆర్థిక సంక్షోభం నుంచి బైటపడవేసేందుకు కొన్ని చర్యలు తీసుకోవచ్చు. ఆ తరువాత ఈ సంక్షోభం ఇతర ప్రాంతాల్లో మరింత తీవ్రంగా కనిపించవచ్చు. ఉత్పాదక రహిత ఆర్థిక పెట్టుబడుల ప్రతికూల ప్రభావాలు ఈ అంశాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. కొనసాగుతున్న యుద్ధక్రీడలకు నాటో దేశాలు, అమెరికా సామ్రాజ్యవాదులు సహాయం చేయడంవల్ల సామాన్యప్రజల బతుకులు మరింత దుర్భరమవుతాయి. కార్మికులు ఫ్రాన్స్, బ్రిటన్(రైల్వే,ఆరోగ్య, కార్మికుల సమ్మెలు) లలో భారీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. కార్మికవర్గ సంక్షేమంపై తీవ్రమైన దాడిని ప్రతిఘటించడమే నిరసనప్రదర్శనలు పెట్టుబడీదారీవ్యవస్థలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభంలో కార్మికులు తప్పనిసరిగా అపారంగా నష్ట పోతున్నారు. ప్రస్తుత బ్యాంకింగ్ సంక్షోభం నుంచి బైట పడేందుకు సామ్రాజ్యవాదులు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది శాంతికోసం ఎలుగెత్తుతున్న నినాదాలను వినిపించు కొని తక్షణం రష్యా-ఉక్రెయిన్, తైవాన్ తీరంలో జరుగుతున్న యుద్ధక్రీడలను నిలిపివేయాలి.

గుజరాత్ అసెంబ్లీలో రాహుల్ ప్రకంపనలు

16 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్



గాంధీనగర్: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అనర్హతపై గుజరాత్ అసెంబ్లీ సోమవారం దద్దరిల్లింది. ఎంపీగా రాహుల్‌ను అనర్హుడిగా ప్రకటించడానికి నిరసనగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభలో ఆందోళనకు దిగారు. తీవ్ర గందరగోళం సృష్టించారు. దీంతో 17 మందికిగాను 16 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ శంకర్ చౌదరి బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేంత వరకూ సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ తర్వాత సభ నుంచి బయటికి వెళ్లకుండా వెల్‌లోనే కూర్చున్న ఇమ్రాన్ ఖేదవాలా, జెనిబెన్ థాకూర్, అమృత్‌జీ థాకూర్ సహా కొంతమంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను మార్షల్స్ బలవంతంగా బయటికి తీసుకెళ్లారు. మరో ఎమ్మెల్యే అనంత్ పటేల్ సభకు హాజరు కాకపోవడంతో ఆయన సస్పెన్షన్ నుంచి తప్పించుకున్నట్లు అయింది. ఉదయం ప్రశ్నోత్తరాలు ప్రారంభమైన వెంటనే కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత అమిత్ చవడా లేచి...రాహుల్‌గాంధీ అనర్హతపై చర్చకు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు ప్రస్తావిస్తున్నందుకుగాను రాహుల్‌గాంధీ నోరు నొక్కడానికే బీజేపీ ప్రభుత్వం ఆయనను అనర్హుడిగా ప్రకటించిందని విమర్శించారు. నేరపూరిత పరువునష్టం కేసులో సూరత్ కోర్టు రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధించడం, లోక్‌సభ నుంచి ఆయనను అనర్హుడిగా ప్రకటించడం వెంట వెంటనే జరిగాయి. రాహుల్‌ను అనర్హుడిగా చేసినందుకు నిరసనగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా నల్లచొక్కాలు ధరించి అసెంబ్లీకి వచ్చారు. ప్రశ్నోత్తరాల సమయంలో రాహుల్ వ్యవహారంపై చర్చ కుదరదని, ఆ తర్వాత ఈ అంశాన్ని ప్రస్తావించాలని, కూర్చోవాలని చవడాకు స్పీకర్ విజ్ఞప్తి చేశారు. ఆ సమయంలో ఇతర కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. 'మోదీ-అదానీ భాయీ భాయీ' అంటూ నినాదాలు చేశారు. ప్రధాని నరేంద్రమోదీ, గౌతం అదానీ కలిసి ఉన్న ఫొటోలు, ప్లకార్డులు ప్రదర్శించారు. వెల్‌లో నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ఆపకపోవడంతో...ప్రజల సమయాన్ని వృథా చేస్తే సహించేది లేదని స్పీకర్ ప్రతిపక్షాన్ని హెచ్చరించారు. గందరగోళం మధ్యే ప్రశ్నోత్తరాలు పూర్తి చేశారు. ఆ తర్వాత సభలో గందరగోళం సృష్టిస్తున్న కాంగ్రెస్ సభ్యులపై శాసనసభ వ్యవహారాల మంత్రి రుషికేశ్ పటేల్ మండిపడ్డారు. బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేంత వరకూ కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేయాలని ఆయన తీర్మానం ప్రతిపాదించారు. కాంగ్రెస్ సభ్యులు లేవనెత్తిన అంశం గుజరాత్‌కు సంబంధించినది కాదని, ముందస్తు వ్యూహంతోనే వారు సభలో అల్లరి చేస్తున్నారని పటేల్ విమర్శించారు. గుజరాత్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేంత వరకూ వారిని సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరారు. పటేల్ ప్రతిపాదనను మంత్రులు బల్వంత్‌సిన్హా రాజ్‌పూత్, రాఘవ్‌జీ పటేల్ బలపరిచారు. ఆప్ ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేయకపోవడంతో పటేల్ తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో వారిని సమావేశాలు ముగిసే వరకూ సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

ఒడిశా అసెంబ్లీలో బ్లాక్‌డే

రాహుల్ అనర్హతపై ఒడిశా అసెంబ్లీలోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. బ్లాక్ డే నిర్వహించారు. దీంతో సభను సాయంత్రం నాలుగు గంటల వరకు వాయిదా వేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నల్లచొక్కాలు ధరించి అసెంబ్లీకి వచ్చారు. ప్రశ్నోత్తరాల సమయంలో వెల్‌లోకి దూసుకెళ్లి మోదీ ప్రభుత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తోందని విమర్శించారు. స్పీకర్ పోడియం పైకి ఎక్కడానికి ప్రయత్నించారు. సభ నిర్వహణ సాధ్యం కాకపోవడంతో స్పీకర్ బీకే అరుఖా వాయిదా వేశారు. అసెంబ్లీకి రావడానికి ముందు సీఎల్పీ నేత నరసింగ మిశ్రా చాంబర్‌లో కాంగ్రెస్ సభ్యులు సమావేశమయ్యారు. పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ కూడా సమావేశానికి హాజరయ్యారు.

దిల్లీలో యువజన కాంగ్రెస్ నిరసన

పార్లమెంటుకు ప్రదర్శనను అడ్డుకున్న పోలీసులు

న్యూదిల్లీ: లోక్‌సభ నుంచి రాహుల్‌గాంధీని అనర్హుడిగా ప్రకటించడానికి నిరసనగా వేలాదిమంది యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సోమవారం ధర్నా చేశారు. అక్కడి నుంచి పార్లమెంటుకు ప్రదర్శనగా వెళ్లేందుకు ప్రయత్నించిన కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువజన కాంగ్రెస్ చేపట్టిన ఆందోళనలో దేశ నలుమూలల నుంచి వచ్చిన యువత పాల్గొన్నారు. రాహుల్‌గాంధీకి సంఘీభావం ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని విమర్శించారు. యువజన కాంగ్రెస్ జెండాలు, సత్యమేవ జయతే ప్లకార్డులు ప్రదర్శిస్తూ రాహుల్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 'మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడకుండా... ప్రశ్నించకుండా కేంద్రం కక్షసాధింపునకు పాల్పడుతోంది. అదానీ గురించి రాహుల్ ప్రశ్నించాచరు. అందుకే అనర్హత పేరుతో రాహుల్ గొంతు నొక్కేశారు' అని యువజన కాంగ్రెస్ నేత విక్రమ్ విమర్శించారు. రాహుల్‌గాంధీ భయపడేది లేదు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తూనే ఉంటారని స్పష్టంచేశారు. తమ నిరసనలో భాగంగా పార్లమెంటును ఘెరావ్ చేస్తామని ఆందోళనకారులు చెప్పారు. పార్లమెంటుకు ప్రదర్శనగా వెళుతున్న కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్ కూడా అందులో ఉన్నారు. పెద్దసంఖ్యలో ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌కు బస్సుల్లో తరలించామని, జంతర్ మంతర్ వద్ద నిరసనకే అనుమతిచ్చామని, కానీ కార్యకర్తలు బారికేడ్లు తోసుకుంటూ పార్లమెంట్ వైపు ప్రదర్శనకు ప్రయత్నించారని, అందుకే అదుపులోకి తీసుకున్నామని సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు.

కేజ్రీవాల్ విచారణపై 'స్టే' పొడిగింపు

న్యూదిల్లీ: పార్లమెంట్ ఎన్నికల ప్రచారం (2014)లో భాగంగా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ, కాంగ్రెస్‌లపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలకు సంబంధించి నమోదైన కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై విచారణపై సుప్రీంకోర్టు మధ్యంతర స్టేను పొడిగించింది. సుల్తాన్‌పూర్‌లోని ట్రయల్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసు నుంచి విముక్తి కల్పించేందుకు నిరాకరిస్తూ గత నెలలో అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రతివాదుల తరపున ఎవరూ హాజరుకాకపోవడంతో న్యాయమూర్తులు కేఎం జోసెఫ్, బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను మే మొదటి వారానికి వాయిదా వేసింది. విచారణపై మధ్యంతర ఉత్తర్వులు కొనసాగించాలని ధర్మాసనం పేర్కొంది. కేజ్రీవాల్‌పై ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 125 కింద నేరం మోపబడింది. ఇది ఎన్నికలకు సంబంధించి వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడానికి సంబంధించింది. 'జో కాంగ్రెస్ కో ఓట్ దేగా, మేరా మాన్నా హోగా, దేశ్ కే సాథ్ గద్దరీ హోగీ.... జో భాజపా (బీజేపీ) కో ఓట్ దేగా యూజ్ ఖుదా భీ మాఫ్ నహీన్ కరేగా (కాంగ్రెస్‌కు ఓటు వేసే వారు దేశానికి ద్రోహం చేసినట్టే. బీజేపీకి ఓటు వేసిన వారిని దేవుడు క్షమించడు)' అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. న్యాయవాది వివేక్ జైన్ ద్వారా కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రసంగానికి సంబంధించి ఎలాంటి వీడియో క్లిప్ లేదా పూర్తి ట్రాన్స్క్రిప్ట్ లేకుండా చట్టంలోని సెక్షన్ 125 కింద కేసును నమోదు చేయవచ్చా అని ప్రశ్నించారు. ఈ కేసులో కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ వాదనలు వినిపించారు. కేజ్రీవాల్ ఏ మతం లేదా కులాన్ని ప్రస్తావించలేదని, చట్టంలోని సెక్షన్ 125 అమలు చేయడానికి ఒక రాజకీయ పార్టీని మాత్రమే పౌరుల తరగతిగా పరిగణించలేమని పిటిషన్‌లో పేర్కొన్నారు.

నేడు 'ఈపీఎఫ్' వడ్డీ రేటు ఖరారు

న్యూదిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్)పై వడ్డీరేటు మంగళవారం ఖరారు కానుంది. ఈపీఎఫ్ఓ బోర్డు రెండు రోజుల కీలక సమావేశం సోమవారం ప్రారంభమైంది. ఈ బోర్డు సమావేశంలో ఈపీఎఫ్‌పై వడ్డీ రేటు సవరించే అవకాశం ఉంది. మంగళవారం తుది నిర్ణయం వెలువడనుంది. వడ్డీ రేట్ల సవరణతో పాటు, అధిక పెన్షన్ సమస్యను కూడా బోర్డు చర్చించనుంది. దీంతోపాటు వీటిని సజావుగా అమలు చేయడానికి సూచనలు చేసే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాలు పేర్కొన్నాయి. మీడియా నివేదికల ప్రకారం... ప్రభుత్వం 2022-23 ఆర్థిక సంవత్సరానికి అనుగుణంగా ఈపీఎఫ్ డిపాజిట్లపై వడ్డీ రేటును ప్రస్తుతం 8.1 శాతం నుంచి 8 శాతంగా నిర్ణయించే అవకాశం ఉంది. 2022-23 ఆదాయాల ఆధారంగా ఈపీఎఫ్ఓ ఫైనాన్స్ ఇన్వెస్ట్‌మెంట్, ఆడిట్ కమిటీ దీనిని సిఫార్సు చేసింది. ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు, ప్రభుత్వం, కార్మికులు, యజమానుల ప్రతినిధులతో కూడిన త్రైపాక్షిక సంస్థ.. సీబీటీ వడ్డీ రేటును నిర్ణయిస్తుంది. దీనికి కార్మికశాఖమంత్రి నేతృత్వం వహిస్తారు. 2021-22 కోసం, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై నాలుగు దశాబ్దాల కాలంలో అత్యంత తక్కువ వడ్డీ రేటు 8.1 శాతాన్ని ప్రభుత్వం ఆమోదించింది. 2020-21 సంవత్సరానికి ఈపీఎఫ& డిపాజిట్లపై 8.5 శాతం వడ్డీ రేటును సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) మార్చి 2021లో నిర్ణయించింది.

లాలూ బెయిల్‌పై సీబీఐ పిటిషన్ తిరస్కృతి

న్యూదిల్లీ: రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఐదేళ్ల జైలు శిక్ష పడిన జార్ఖండ్‌లోని డోరండా ట్రెజరీ కేసులో ఆయనకు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాలు చేస్తూ సీబీఐ వేసిన పిటిషన్‌పై నోటీసులిచ్చేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. తాము నోటీసు జారీ చేయడం లేదని, సీబీఐ దాఖలు చేసి పెండింగ్‌లో ఉన్న ఇలాంటి అప్పీలుతో ఈ అంశాన్ని జత చేస్తున్నామని న్యాయమూర్తులు అజయ్ రస్తోగి, బేల ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.

కోశ్యారీ వ్యాఖ్యలను అలా చూడలేం...

చర్యలు కోరుతూ దాఖలైన వ్యాజ్యం కొట్టేసిన బాంబే హైకోర్టు

ముంబై: ఛత్రపతి శివాజీ మహారాజ్, మహాత్మా పూలే, ఆయన భార్య సావిత్రీబాయి, మరాఠీ మనోస్ గురించి చేసిన వ్యాఖ్యలకు గాను మహారాష్ట్ర మాజీ గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ, బీజేపీ ఎంపీ సుధాన్షు త్రివేదిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలయిన పిటిషన్‌ను బాంబే హైకోర్టు గత వారం కొట్టివేసింది. ఈ వ్యాఖ్యలు 'చరిత్ర విశ్లేషణ' స్వభావంలో ఉన్నాయని, చరిత్ర గురించి 'సమాజానికి జ్ఞానోదయం' చేయాలనేది వారి ఉద్దేశమని న్యాయమూర్తులు సునీల్ షుక్రే, అభయ్ వాఘ్వాసేతో కూడిన డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రాథమికంగా చూపిన వాంగ్మూలాలు ఏ క్రిమినల్ చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరం కాదని తేల్చింది. 'అందువల్ల, ఈ ప్రకటనలు ఏ గొప్ప వ్యక్తిని అగౌరవపరచడం ఊహల ద్వారా చూడలేము' అని కోర్టు పేర్కొంది. కోశ్యారీ, త్రివేది చేసిన ప్రకటనలు సమాజంలో ఎంతో గౌరవం పొందే చారిత్రక వ్యక్తులను అగౌరవపరిచేలా ఉన్నాయని పేర్కొంటూ షెడ్యూల్డ్ కులాల వర్గానికి చెందిన రాణా కతర్నావేర్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది.

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు ప్రారంభం

న్యూదిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఒకటో తరగతి ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నేటి నుంచి ఏప్రిల్ 17న రాత్రి 7గంటల వరకు కొనసాగనుంది. కేంద్రీయ విద్యాలయాల్లో 1 నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాల కోసం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఒకటో తరగతిలో ప్రవేశం పొందాలనుకునే చిన్నారుల వయస్సు 2023 మార్చి 31 నాటికి ఆరేళ్లు పూర్తి కావాల్సి ఉంటుందని పేర్కొంది. కేవీల్లో సీటు కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి ప్రాథమిక /వెయిటింగ్ తొలి జాబితాను ఏప్రిల్ 20న విడుదల చేసి ఏప్రిల్ 21 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్టు కేవీఎస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు రెండో, మూడో జాబితాలను ప్రకటించి అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఇకపోతే, రెండు, ఆ పైతరగతుల్లో ఖాళీగా ఉండే సీట్ల భర్తీ ప్రక్రియ ఏప్రిల్ 3న ఉదయం 8గంటలకు ప్రారంభమై ఏప్రిల్ 12 సాయంత్రం 4గంటల వరకు కొనసాగుతుంది.

హరియాణాలో నేరస్తులపై ఉక్కుపాదం

చండీగఢ్: సంఘవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న 1300 మందికి పైగా నేరస్తులను హరియాణా పోలీసులు అరెస్టు చేశారు. నేరస్తులపై ఉక్కుపాదం మోపే చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు తనఖీలు చేపట్టారు. ఆపరేషన్ ఆక్రమణ్ కింద ఐపీసీలోని అనేక సెక్షన్లు, అక్రమమాదక ద్రవ్యాలు, ఆయుధ చట్టం, ఎక్సైజ్ చట్టం కింద 565 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. రాష్ట్రంలో నేరస్తుల కార్యకలాపాలపై పూర్తిస్థాయి సమాచారం మేరకు నిందితులపై కేసులు నమోదు చేసినట్లు హరియాణా డీజీపీ పీకే అగర్వాల్ చెప్పారు. ఆయుధాల అక్రమ రవాణా, మాదకద్రవ్యాలు, కల్తీమద్యం వంటి నేరాలకు పాల్పడుతున్న నేరస్తులపై కఠినచర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీనియర్ పోలీసు అధికారుల నేతృత్వంలో 7,620 మంది సిబ్బందితో 1443 బృందాలు సమన్వయంతో ఆదివారం ఉదయం నుంచి దాడులు చేశాయని వివరించారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా ప్రోత్సాహకర ఫలితాలు లభించాయన్నారు. 80 అక్రమ ఆయుధాలు, 40 కాట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ తెలిపారు. 52 కేజీల గంజాయి, 30 కేజీల హెరాయిన్, 595 గ్రాముల నల్లమందు, 1222 నిషేధిత టాబ్లెట్లు, 62 క్యాప్సుల్స్ పట్టుకున్నట్లు వివరించారు. ఐదుగురు మోస్ట్ వాంటెడ్ నేరస్తులను అరెస్టు చేశామన్నారు.

హెచ్ఐఎంసీ ఎన్నికల్లో వామపక్ష-కాంగ్రెస్ కూటమి ఘనవిజయం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ పుర్బామెదినీపూర్ జిల్లా హల్దియా డాక్ ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్ కమిటీ (హెచ్ఐఎంసీ) ఎన్నికల్లో వామపక్ష- కాంగ్రెస్ కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థులను చిత్తుగా ఓడించింది. సాగరిగి అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఉపఎన్నికలో వామపక్షాలు మద్దతిచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి బైరాన్ బిస్వాస్ 22,980 ఓట్ల తేడాతో టీఎంసీ అభ్యర్థి దేవాశిస్ బెనర్జీపై విజయం సాధించారు. దీంతో హెచ్ఐఎంసి ఎన్నికల ఫలితం ప్రాధాన్యతను సంతరించుకుంది. పంచాయతీ ఎన్నికలకు ముందు వరుస పరాజయాలతో అధికార టీఎంసీ కంగుతిన్నది. హెచ్ఐఎంసీ ఎన్నికల్లో మొత్తం 19 పోస్టులకు ఓటింగ్ జరిగింది. 737 మంది ఓటర్లకుగాను 694 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వామపక్ష-కాంగ్రెస్ కూటమి, టీఎంసీ కార్మిక సంఘం (ఐఎన్‌టీయూసీ), భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) మధ్య ముక్కోణపు పోటీ జరిగింది. మూడు ప్యానెళ్లలో కలిపి 58 మంది అభ్యర్థులు బరిలో దిగారు. గత ఎన్నికల్లో అన్నిస్థానాలు గెల్చుకున్న టీఎంసీకి ఈసారి జరిగిన ఎన్నికల్లో ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. వామపక్ష-కాంగ్రెస్ కూటమి అన్నిస్థానాలు కైవసం చేసుకొని విజయఢంకా మోగించింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ ఎన్నికల్లో 13 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత టీఎంసీ తొలిసారి పరాజయం చవిచూసింది. హల్దియారేవు వద్ద వామపక్ష కార్మికసంఘం ప్రతినిధి మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌లో ప్రస్తుత రాజకీయ పరిణామాల తీరుతెన్నులను ఈ విజయం స్పష్టం చేస్తున్నదని వ్యాఖ్యానించారు. పుర్బా మెదినీపూర్ జిల్లాలో జరిగే పంచాయతీ ఎన్నికల్లోనూ వామపక్ష-కాంగ్రెస్ కూటమి బరిలో దిగడం ఖాయమని, ఆ ఎన్నికల్లోనూ సత్తా చూపుతామని ధీమా వ్యక్తం చేశారు. ఐఎన్‌టీయూసీ నాయకులు మాత్రం ఈ ఎన్నికల ఫలితాలకు ఎలాంటి ప్రాధాన్యత లేదని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థలకు జరగబోయే ఎన్నికలపై దీని ప్రభావం ఎంతమాత్రం ఉండదన్నారు.

కర్ణాటకలో రిజర్వేషన్ల చిచ్చు

- యెడియూరప్ప ఇంటి వద్ద భారీ నిరసన, రాళ్ల దాడి
- శివమొగ్గలో 144వ సెక్షన్

శివమొగ్గ: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కర్ణాటకలో అధికార బీజేపీ తీసుకున్న నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఒక వర్గానికి చెందిన నేతలు మాజీ ముఖ్యమంత్రి యెడియూరప్ప ఇంటి వద్ద భారీ నిరసన చేపట్టారు. షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన రిజర్వేషన్లపై ఇటీవల కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే ఈ నిరసనకు కారణమైంది. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బంజారా వర్గానికి చెందిన ప్రజలు యెడియూరప్ప ఇంటికి ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నిరసనకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. వందలాది నిరసకారులను అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో కొందరు పోలీసులు గాయపడ్డారు. దీంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి నిరసనకారులను చెదరగొట్టారు. ఈ సందర్భంగా మహిళలతో సహా అనేక మంది గాయపడ్డారు. ఈ సంఘటన నేపథ్యంలో ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించారు.

కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం బసవరాజ్ బొమ్మై నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకున్నది. విద్యా, ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లను వర్గీకరించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఎస్సీ వర్గాలకు కేటాయించిన 17 శాతం రిజర్వేషన్లను ఉప వర్గాల వారీగా విభజించాలని సూచించింది. ఈ నిర్ణయాన్ని బంజారా, ఇతర వర్గాలు తీవ్రంగా వ్యతిరేకించారు. రిజర్వేషన్ల ఉప వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల తాము నష్టపోతామని బంజారా సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రానికి చేసిన సిఫార్సును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రయాగ్‌రాజ్‌కు గ్యాంగ్‌స్టర్

తరలింపులో ఉత్కంఠ... ఆవును ఢీకొన్న కాన్వాయ్

న్యూదిల్లీ: వందకుపైగా క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ మాజీ ఎంపీ అతీక్ అహ్మద్‌ను గుజరాత్‌లోని సబర్మతి కేంద్ర కారాగారం నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు యూపీ పోలీసులు తరలించారు. ఇదే సమయంలో తనకు ప్రాణహాని ఉందని.. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపేస్తారని భయపడుతూ జైలు నుంచి బయటకు వచ్చేందుకు నిందితుడు అతీక్ నిరాకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అతన్ని తీసుకెళ్తున్న పోలీస్ కాన్వాయ్‌కు మధ్యప్రదేశ్‌లోని శివ్‌పురి జిల్లాలో స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. వాహన శ్రేణికి ఓ ఆవు అడ్డురావడంతో అతీక్ ప్రయాణిస్తున్న వాహనం దాన్ని ఢీకొట్టింది. దీంతో కొద్దిసేపు కాన్వాయ్‌ను అక్కడే నిలిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఒక కిడ్నాప్ కేసులో తీర్పు వెలువడనున్న సందర్భంగా ఈ నెల 28న ప్రయాగ్‌రాజ్ న్యాయస్థానంలో నిందితుడిగా అహ్మద్‌ను హాజరుపరచాల్సి ఉంది. దీంతో గుజరాత్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు నిందితుడిని తరలిస్తున్నారు. కోర్టులో హాజరుపరిచే నెపంతో తనను పోలీసులు తీసుకువెళ్తున్నారని, ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే దారిలోనే తనను హతమార్చే అవకాశం ఉందని అహ్మద్ ఆందోళన వ్యక్తం చేశాడు. జైలు నుంచి బయటకు తీసుకువచ్చే సమయంలోనూ హత్య, హత్య అంటూ విలేకరుల ముందు భయంతో కేకలు వేశాడు. ఈ క్రమంలో నిందితుడిని తీసుకువెళుతున్న వాహన శ్రేణి ప్రమాదానికి గురికావడం కలకలం రేపింది. వాహనం ఢీకొట్టడంతో ఆ మూగజీవి రోడ్డు డివైడర్‌పై పడిపోవడంతో అది మరణించి ఉండవచ్చని భావించారు. అయితే, కొద్దిసేపటి తర్వాత అది లేచి వెళ్లిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. న్యాయస్థానంలో వచ్చే అన్ని తీర్పులను అంగీకరిస్తామని ఆయన సోదరి అయేషా నూరీ చెప్పారు. కేవలం ఆయన ప్రాణాలపైనే ఆందోళన చెందుతున్నామన్నారు. గుజరాత్ నుంచి యూపీలోని ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న పోలీసు కాన్వాయ్‌ను అయేషా నూరీ అనుసరిస్తున్నారు. 45 మంది పోలీసుల బృందంతో కూడిన కాన్వాయ్ నిందితుడిని తరలిస్తోంది. సుమారు 25 గంటల ప్రయాణం అనంతరం సోమవారం సాయంత్రం ఈ కాన్వాయ్ ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంది.

అనర్హతపై సుప్రీంకు ఎంపీ ఫైజల్

నేడు విచారణ

న్యూదిల్లీ: ఒక హత్యాయత్నం కేసులో తనపై నేరారోపణ, పదేళ్ల జైలు శిక్షపై కేరళ హైకోర్టు స్టే విధించిన తర్వాత ఎంపీగా అనర్హత వేటు వేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోనందుకు లోక్‌సభ సెక్రటేరియట్‌పై లక్షద్వీప్ ఎంపీ, ఎన్‌సీపీ నాయకుడు మహ్మద్ ఫైజల్ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం విచారణకు జాబితా చేయడానికి సుప్రీంకోర్టు అంగీకరిం చింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు పి.ఎస్.నరసింహ, జేబీ పార్దివాలాతో కూడిన ధర్మాసనం లక్షద్వీప్ మాజీ పార్లమెంటేరియన్ తరపు సీనియర్ న్యాయవాది ఎ.ఎం.సింఘ్వీ... దోషిగా నిర్ధారించి, హైకోర్టు శిక్షను నిలిపివేసినప్పటికీ, ఆ వ్యక్తిని తిరిగి ఎంపీగా నియమించడం లేదన్న వాదనలను పరిగణనలోకి తీసుకుంది. హైకోర్టు ఆదేశాలపై కేంద్ర పాలిత ప్రాంతం చేసిన అప్పీలు మంగళవారం సుప్రీం కోర్టు మరో ధర్మాసనం ముందు విచారణకు రానుందని సింఘ్వీ తెలిపారు. 'దీనిని ఎస్ఎల్‌పీ (లక్షద్వీప్)తో జాబితా చేయండి' అని ధర్మాసనం పేర్కొంది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నాయకుడి తరపున హాజరయిన సింఘ్వీ మాట్లాడుతూ 'ఈ ఏడాది జనవరిలో స్థానిక కోర్టు దోషిగా నిర్ధారించి శిక్ష విధించిన వెంటనే ఫైజల్‌పై ఎంపీగా అనర్హత వేటు వేయాలని లోక్‌సభ కోరింది. అయితే హైకోర్టు శిక్షపై స్టే విధించినప్పటికీ అతని సభ్యత్వం ఇంకా పునరుద్ధరణ కాలేదు' అని తెలిపారు. జనవరి 13న లోక్‌సభ సెక్రటేరియట్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, కవరత్తిలోని సెషన్స్ కోర్టు హత్యాయత్నం కేసులో దోషిగా నిర్ధారించిన జనవరి 11 నుంచి ఫైజల్ లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడని ప్రకటించింది. న్యాయవాది కె.ఆర్.శశిప్రభు ద్వారా సుప్రీం కోర్టులో దాఖలు చేసిన తన పిటిషన్‌లో ఫైజల్, జనవరి 25న తన నేరారోపణపై హైకోర్టు స్టే విధించినప్పటికీ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవడంలో లోక్‌సభ సెక్రటేరియట్ విఫలమైందని తెలిపారు. పిటిషనర్ జనవరి 13 నాటి నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోకుండా ప్రతివాది, లోక్‌సభ సెక్రటేరియట్ సెక్రటరీ జనరల్ చట్టవిరుద్ధమైన నిష్క్రియాత్మక చర్యకు వ్యతిరేకంగా, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం ఈ కోర్టు అసాధారణ అధికార పరిధిని అమలు చేయడానికి పిటిషనర్ నిర్బంధించబడ్డారు. లక్షద్వీప్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి అతని పార్లమెంటు సభ్యత్వానికి అనర్హుడయ్యాడు' అని పిటిషన్ పేర్కొంది. ప్రతి రోజు పార్లమెంటుకు వచ్చినా... తనను భద్రతా సిబ్బంది సభ లోపలికి అనుమతించటం లేదని కోర్టు దృష్టికి తీసుకు వచ్చారు. తనపై లోక్‌సభ సచివాలయం విధించిన అనర్హతను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 8 ప్రకారం పార్లమెంటు సభ్యుడు అనర్హత వేటు వేయడాన్ని అప్పీల్ కోర్టు నిలిపివేసినట్లయితే, 'పరిష్కరించబడిన చట్టం నిబంధనలు' లో ప్రతివాది నిష్క్రియాత్మకత ఉందని పేర్కొంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 389 ప్రకారం అప్పీలేట్ కోర్టు ద్వారా నేరారోపణపై స్టే విధించిన పక్షంలో పని చేయడం ఆగిపోతుందని పేర్కొంది. ఫైజల్, లోక్‌సభలోని ఎన్‌సీపీ నాయకురాలు సుప్రియా సూలే ఇద్దరూ తన అనర్హతను అధికారికంగా రద్దు చేయాలని కోరుతూ కనీసం నెల రోజుల క్రితమే లోక్‌సభ స్పీకర్‌కి లేఖ రాశారు. 2018లో లోక్ ప్రహరీ వర్సెస్ భారత ఎన్నికల సంఘం ముగ్గురు న్యాయమూర్తుల సుప్రీం కోర్టు ద్వారా ఈ వైఖరిని ఇటీవల పునరుద్ఘాటించారని ఇది వాదించింది. భారత ఎన్నికల సంఘం... సరైన చట్టపరమైన స్థితిని గమనించడం ద్వారా జనవరి 18, 2023 నాటి ఉప ఎన్నికల ప్రెస్ నోట్‌ను రీకాల్ చేసింది. అయితే, ప్రతివాది వివిధ రకాలుగా ఉన్నప్పటికీ జనవరి 13, 2023 నాటి అనర్హత నోటిఫికేషన్‌ను రద్దు చేయడం లేదు. ప్రాతినిధ్యాలు, తద్వారా పిటిషనర్ పార్లమెంటు బడ్జెట్ సమావేశంలో, ఇప్పుడు జరుగుతున్న సమావేశంలో పాల్గొనడానికి నిరాకరించారు' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాహుల్ గాంధీపై అనర్హత సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. మోదీ ఇంటి పేరును కించపర్చారన్న కేసులో రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష పడటంతో ఇటీవల ఆయనపై లోక్‌సభ సచివాలయం అనర్హత వేటు వేసింది. అయితే ఈ తీర్పుపై రాహుల్ ఇంకా పైకోర్టులో అప్పీలు చేయలేదు.

22లోగా అధికారిక బంగ్లా ఖాళీ చేయండి

రాహుల్ గాంధీకి నోటీసు ఇచ్చిన లోక్‌సభ హౌసింగ్ కమిటీ

న్యూఢిల్లీ: అనర్హత వేటు పడిన లోక్‌సభ సభ్యుడు రాహుల్ గాంధీ తనకు కేటాయించిన అధికారిక బంగ్లాను ఏప్రిల్ 22లోగా ఖాళీ చేయాలని కోరినట్లు అధికారిక వర్గాలు సోమవారం తెలిపాయి. 12, తుగ్లక్ లేన్ బంగ్లాను ఖాళీ చేయాలని గాంధీకి నోటీసును లోక్‌సభ హౌసింగ్ కమిటీ అందజేసింది. గత వారం జారీ చేసిన అనర్హత నోటీసును అనుసరించింది. గుజరాత్‌లోని స్థానిక కోర్టు మార్చి 23న క్రిమినల్ పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీని దోషిగా నిర్ధారించి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ఆ కారణంగా ఆయన లోక్‌సభ సభ్యునిగా స్వయంచాలకంగా అనర్హత వేటు పడింది. అనర్హత వేటు పడిన లోక్‌సభ సభ్యుడు తన సభ్యత్వాన్ని కోల్పోయిన ఒక నెల లోపు అధికారిక బంగ్లాను ఖాళీ చేయాల్సి ఉంటుందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. మరో అధికారి మాట్లాడుతూ రాహుల్ గాంధీ హౌసింగ్ కమిటీకి పొడిగించిన స్టే కోరుతూ లేఖ రాయవచ్చని, ఆ అభ్యర్థనను ప్యానెల్ పరిశీలించవచ్చని చెప్పారు. పార్లమెంటు సభ్యునిగా గాంధీకి లభించే అన్ని ప్రయోజనాలను కూడా సమీక్షిస్తున్నారు.

ప్రతి పౌరుడిపై రూ.5.50 లక్షల అప్పు: యనమల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి పౌరుడిపై సగటున రూ.5.50లక్షల అప్పు భారం మోపిందని, ఈ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ.12.50లక్షల కోట్లను దాటి పోతుందని శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు యన మల రామకృష్ణుడు ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఈ పరిస్థితిపై అటు కేంద్రంగాని, ఆర్‌బీఐగాని ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇంతటి దుర్భర పరిస్థితి గతంలో ఎన్నడూ లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం సమస్యల్ని సృష్టించడంతోపాటు ఆర్థిక వ్యవస్థని కుదేలు చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పాలన ముగిసే నాటికి ఓపెన్ మార్కెట్ అప్పులు రూ.2.5 లక్షల కోట్లకు చేరుకుంటాయని, ఆఫ్ బడ్జెట్ రుణాలు ఐదేళ్లలో ఇంచుమించు రూ.5 లక్షల కోట్లు అవనున్నాయని విశ్లేషించారు. మార్చి 2024 నాటికి ఔట్ స్టాండింగ్ అప్పులు పెరగనున్నాయని, ఇంత జరుగుతున్నా ఆర్బీఐ ఇంకా రుణాలు తీసుకునేందుకు అనుమతులిస్తూనే ఉందన్నారు. రాబోయే కాలంలో ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు, రోజువారి నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగి రూ.15వేల కోట్ల భారం ప్రజలపై పడనుందని చెప్పారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించండి

- అదానీ వ్యవహారం... రాహుల్ అనర్హతపై విపక్షాల నిరసన ప్రదర్శన
- మహాత్ముడి విగ్రహం వద్ద నల్ల దుస్తులతో ధర్నా

న్యూఢిల్లీ: అదానీ వ్యవహారం, లోక్‌సభకు రాహుల్ గాంధీ అనర్హతపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ అనేక మంది ప్రతిపక్ష ఎంపీలు నల్ల దుస్తులు ధరించి సోమవారం పార్లమెంటు నుంచి విజయ్ చౌక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ సోనియా గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సహా నిరసనకారులు పార్లమెంటు ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్దకు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'సత్యమేవ జయతే' అనే భారీ బ్యానర్, 'ప్రజాస్వామ్యాన్ని రక్షించండి' అని రాసిన ప్లకార్డులను పట్టుకుని, ఎంపీలు విజయ్ చౌక్ వైపునకు వెళ్లి అక్కడ వారు ధర్నా నిర్వహించారు. 'గత కొన్నేళ్లుగా అదానీ సంపద ఇంతగా ఎలా పెరిగిపోయింది. విదేశాలకు వెళుతున్నప్పుడు పారిశ్రామికవేత్తను ఎన్నిసార్లు తీసుకెళ్లారు. అదానీపై లేవనెత్తిన ప్రశ్నలకు ప్రధాని సమాధానం చెప్పలేకపోయారు' అని విజయ్ చౌక్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఖర్గే అన్నారు. 'మాకు అదానీ సమస్యపై జేపీసీ కావాలి. ప్రభుత్వం దీనికి ఎందుకు అంగీకరించడం లేదు? జేపీసీ విచారణకు మీరు ఎందుకు భయపడుతున్నారు.. అంటే 'దాల్ మే కుచ్ కాలా హై' (ఏదో తప్పు)' అని ఆయన అన్నారు. అదానీ గ్రూప్ కార్పొరేట్ మోసం, స్టాక్ ధరల అవకతవకల ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణను ప్రతిపక్షం కోరింది. 2019 క్రిమినల్ పరువు నష్టం కేసులో సూరత్ కోర్టు రాహుల్ గాంధీని దోషిగా నిర్ధారించి, శిక్ష విధించిన తర్వాత, రాహుల్ ఎంపీగా అనర్హత వేటు వేసిన అంశాన్ని కూడా ఖర్గే లేవనెత్తారు. రాహుల్ గాంధీ పరువు తీయాలని మీరు అనుకుంటున్నారని, అందుకే కర్ణాటకలోని కోలార్‌లో వ్యాఖ్యలు చేసినట్టుగానే మీరు కేసును గుజరాత్‌కు బదిలీ చేశారని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యానికి ఈరోజు చీకటి రోజు అని అన్నారు. ప్రధాని ప్రజాస్వామ్యాన్ని 'ఖూనీ' చేస్తున్నందున ప్రతిపక్ష ఎంపీలు నల్ల దుస్తులు ధరించారని ఖర్గే తెలిపారు. ఇప్పటి వరకు ప్రతిపక్షాల నిరసనలకు దూరంగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ సోమవారం ధర్నాలో చేరింది. అంతకుముందు, కాంగ్రెస్, టీఎంసీ, బీఆర్ఎస్, ఎస్పీ సహా వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు సముదాయంలో సమావేశమై అదానీ వ్యవహారాన్ని, రాజ్యసభ, లోక్‌సభలో రాహుల్ గాంధీ అనర్హత అంశాన్ని ముందుకు తీసుకెళ్లే వ్యూహంపై చర్చించారు. కొంతమంది పార్లమెంటు సభ్యులు రాహుల్ లోక్‌సభ అనర్హత వేటుకు నిరసనగా నల్ల దుస్తులు ధరించారు. డీఎంకే, సమాజ్‌వాది పార్టీ, జేడీ(యూ), బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, ఆర్‌జేడీ, ఎన్‌సీపీ, ఐయూఎంఎల్, ఎండీఎంకే, కేరళ కాంగ్రెస్, టీఎంసీ, ఆర్ఎస్పీ, ఆప్, ఎన్‌సీ, శివసేన (యూబీటీ) కి చెందిన నాయకులతో పాటు ఇతరులు రాజ్యసభలో విపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేతో ఆయన ఛాంబర్‌లో సమావేశమయ్యారు.

'అదానీ'పై విచారణ ఎందుకు లేదు?

- ప్రధాన మంత్రికి భయమెందుకు?
- మోదీ లక్ష్యంగా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై అనేక ఆరోపణలు వచ్చిన తర్వాత కూడా ఆ గ్రూప్‌లో ప్రజల పదవీ విరమణ నిధి పెట్టుబడిపై ఎందుకు దర్యాప్తు చేయలేదని, భయమెందుకని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని సోమవారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. 'ఎల్ఐసీ మూలధనం... అదానీకి! ఎస్‌బీఐ మూలధనం... అదానీకి! ఈపీఎఫ్‌వో మూలధనం... అదానీకి! 'మోదానీ' బహిర్గతం అయిన తర్వాత కూడా ప్రజల పదవీ విరమణ డబ్బును అదానీ కంపెనీలలో ఎందుకు పెట్టుబడి పెడుతున్నారు?' అని ట్విట్టర్ వేదికగా రాహుల్ గాంధీ ప్రశ్నించారు. 'మిస్టర్ ప్రధానమంత్రి, విచారణ లేదు, సమాధానం లేదు! ఎందుకు అంత భయం' అని హిందీలో చేసిన ఒక ట్వీట్‌లో ఆయన ప్రశ్నించారు. హిండెన్‌బర్గ్ పరిశోధన గత నెలలో మోస పూరిత లావాదేవీలు, వాటాల ధరల తారుమారుతో సహా అనేక ఆరోపణలను చేసిన తర్వాత అదానీ గ్రూప్ వాటాలు మార్కెట్‌లో దెబ్బ తినడంతో పెద్ద రాజకీయ వివాదం చెలరేగింది. గౌతమ్ అదానీ నేతృత్వంలోని గ్రూప్ ఆరోపణలను అబద్ధాలుగా కొట్టిపారేసింది. అదానీ సమస్యపై రాహుల్ గాంధీ ప్రధానిపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ అంశంపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అదానీ అంశంపై తాను ప్రశ్నలు లేవనెత్తడం వల్లే లోక్‌సభకు అనర్హత వేటు వేశారని, అయితే తాను పార్లమెంటుకు జీవితకాలం అనర్హత వేటు వేసినా కూడా కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు.

రియల్ ఫ్రూట్ జ్యూస్‌పై ధృవ్ రాథీ వీడియోను తీసేయండి

కలకత్తా హైకోర్టు ఆదేశం

కోల్‌కతా: ప్రముఖ కంటెంట్ సృష్టికర్త ధ్రువ్ రాథీ డాబర్ ఇండియా రియల్ ఫ్రూట్ జ్యూస్‌పై 'కించపరచడం, లక్ష్యంగా చేసుకున్న' వీడియోను ప్రజలకు అందుబాటులో నుంచి తీసివేయాలని లేదా బ్లాక్ చేయాలని కలకత్తా హైకోర్టు ఇటీవల యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమ వేదికలను ఆదేశిం చింది. 'రాథీ 'లక్ష్మణ రేఖ'ను దాటారు. రియల్‌ని తాజా పండ్ల రసాలతో పోల్చడం ద్వారా ఇది ప్రజల ఆరోగ్యం, జుట్టు పెరుగుదలను, ముఖ్యంగా పిల్లలను ఎలా ప్రభావితం చేస్తుందో చూపడం ద్వారా రియల్ లక్ష్యంగా చేసుకుంది' అని న్యాయమూర్తి జస్టిస్ రవి క్రిషన్ కపూర్ పేర్కొన్నారు. డాబర్ రియల్ ఫ్రూట్ జ్యూస్ బ్రాండ్‌ను సూచించే వీడియో నుంచి కొన్ని భాగాలను తీసివేయాలని కలకత్తా హైకోర్టు మార్చి 15న యాప్ మద్దతుదారు యూట్యూబర్ ధ్రువ్ రాథీని ఆదేశించింది. ప్యాక్ చేసిన పండ్ల రసాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వ్యాఖ్యానిస్తూ ధ్రువ్ రాథీ 13 ఫిబ్రవరి 2023న యూట్యూబ్‌లో వీడియోను పోస్ట్ చేశారు. ఈ వీడియోను ప్రచురించి, ప్రసారం చేయడంలో రాథీ ట్రేడ్ మార్క్ చట్టం 1999, కాపీరైట్ చట్టం 1957లోని నిబంధనలను కూడా ఉల్లంఘించారని పేర్కొంది.

చంద్రబాబుది నీచ రాజకీయం: పేర్ని నాని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వెన్నుపోటుతో గద్దెనెక్కిన నీచ రాజకీయం చంద్రబాబుదని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఎద్దేవా చేశారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సీటు లేదని చెబితే అవమానంగా భావించానని వైసీపీ సస్పెండ్ చేసిన ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి చెప్పడాన్ని ఆయన తోసిపుచ్చారు. 2014 ఎన్నికల్లో ఓడిపోయిన చరిత్ర ఉన్నప్పటికీ 2018 ఎన్నికల చివరి వరకు తాడికొండ నియోజకవర్గంలో వైసీపీ బాధ్యతలు నిర్వర్తిం చిన కత్తెర క్రిస్టినాను కాదని, ఒక కొత్త అభ్యర్థిగా వైద్యురాలిగా శ్రీదేవికి నాడు జగన్ సీటు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అన్నిరకాలుగా కష్టపడి ఎన్నికల్లో శ్రీదేవిని గెలిపించడంతో క్రిస్టినాకు ఎక్కడా నష్టం జరగకుండా, గౌరవప్రదంగా గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి కేటాయించారని వివరించారు. ఏడాది ముందు నియోజకవర్గ ఇన్‌చార్జిని మారిస్తే ఎమ్మెల్యేగా వారిని అవమానిం చినట్లు కాదుగదా? అన్నారు. చేతనైతే సస్పెండైన ఎమ్మెల్యేలంతా ఇప్పుడే రాజీనామా లేఖల్ని స్పీకర్‌కు ఇచ్చి మళ్లీ పోటీచేసి ప్రజల్లో ఆదరణ ఉందని నిరూపించుకోవచ్చని సూచించారు.

సీఎంతో ప్రపంచబ్యాంకు బృందం భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం వైఎస్ జగన్‌ను ప్రపంచబ్యాంకు డైరెక్టర్ అగస్టే టానో కౌమితో కూడిన బృందం సోమవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో భేటీ అయింది. ప్రపంచబ్యాంకు ఆర్థిక సహాయంతో అమలవుతున్న మూడు కార్యక్రమాలపై సీఎం సమీక్షించారు. ప్రజారోగ్యం బలోపేతం, ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎడ్యుకేషన్(సాల్ట్), ఏపీ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు (ఏపీఐఐ ఏటీపీ)ల అమలు తదితర అంశాలపై బృందంతో సీఎం చర్చించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, ఉన్నతాధికారులు ఎంటీ కృష్ణబాబు, ప్రవీణ్ ప్రకాశ్, శశిభూషణ్ కుమార్, సత్యనారాయణ, సురేశ్ కుమార్, వినోద్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్వామినారాయణ్ గురుకుల్ ట్రస్ట్ సభ్యులు, ప్రతినిధుల బృందం సీఎం క్యాంప్ కార్యాలయంలో జగన్‌ను కలిసింది. విశాఖపట్నం, తిరుపతి, పులివెందులలో అంతర్జాతీయస్థాయి పాఠశాలల ఏర్పాటుకు శ్రీ స్వామినారాయణ్ గురుకుల్ ట్రస్ట్ సభ్యులు, ప్రతినిధుల బృందం ముందుకొచ్చింది. ఇందుకు అవసరమైన భూమి కేటాయించేందుకు సీఎం అంగీకరించారు.

ఒంటిమిట్ట కోదండరామస్వామి కళ్యాణ ఆహ్వాన పత్రిక

ఒంటిమిట్ట కోదండరామస్వామివారి సీతారామ కళ్యాణ మహోత్సవ ఆహ్వాన శుభపత్రికను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి సోమవారం వైఎస్ జగన్‌కు అందజేశారు. సీఎంకు వెంకన్న తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏప్రిల్ 5వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు సీతారామ కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 9 వరకు ఒంటిమిట్టలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

శంకర్ సినిమా నుంచి చెర్రీ ఫస్ట్‌లుక్

హైదరాబాద్: రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా సినిమాకి సంబంధించి ఎట్టకేలకు అప్‌డేట్ వచ్చేసింది. మొన్నటి వరకు ఆర్సీ 15 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న సినిమాకు 'గేమ్ చేంజర్' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ ఖరారు చేస్తూ ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉంటే మొదట టైటిల్‌ను మాత్రమే విడుదల చేసింది చిత్ర యూనిట్. తాజాగా సినిమా పేరును వెల్లడిస్తూ ఓ చిన్న వీడియోను చిత్ర యూనిట్ విడుదలచేసింది. దీంతో పాటు ఈ సినిమాలో రామ్ చరణ్ ఫస్ట్ లుక్‌ను సైతం విడుదల చేసింది. పవర్ ఫుల్ టైటిల్‌కు తగ్గట్లుగానే చెర్రీ లుక్ ఉండడంతో ఆయన అభిమానులు ఖుషీ అవుతున్నారు. బైక్‌పై స్టైలిష్ లుక్‌లో ఉన్న ఫొటోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. రామ్ చరణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఈ ఫొటోను విడుదల చేశారు. ఫస్ట్‌లుక్‌తోనే సినిమాపై ఒక్కసారిగా అంచనాలు పెంచేసింది చిత్ర యూనిట్. ఇదిలా ఉంటే శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోన్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోన్న ఈ సినిమాలో శ్రీకాంత్, సునీల్, అంజలి, నవీన్ చంద్ర, ఎస్ జే సూర్య నటిస్తున్నారు. ఈ సినిమాలో చెర్రీ ద్విపాత్రాభినయం చేస్తున్నాడన్న వార్తలు కూడా సినిమాపై అంచనాలు పెంచేసిన విషయం తెలిసిందే.

ఏప్రిల్ 14న ఓటీటీ వేదికపై 'కబ్జా'



హైదరాబాద్: కన్నడ హీరో ఉపేంద్ర ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం కబ్జా. ఆర్ చంద్రు దర్శకత్వం వహించిన ఈ సినిమా గతవారం ప్రేక్షకులు ముందుకు వచ్చింది. కన్నడలో పర్వాలేదనిపించినప్పటికీ మిగతా భాషల్లో అంతగా ఆదరణకు నోచుకోలేదు. కన్నడలో మాత్రమే కలెక్షన్‌ల జోరు కనిపిస్తోంది. తెలుగులో ఈ సినిమాను రూ.3 కోట్ల వరకు బిజినెస్ జరిగింది. ఇప్పటివరకు ఈ సినిమా ఇక్కడ కేవలం కోటికి అటు ఇటుగా కలెక్షన్లు రాబ్టటింది. తెలుగులో హిట్టవ్వాలంటే మరో రెండు కోట్లు సాధించాల్సి ఉంటుంది. మరో మూడు రోజుల్లో దసరా రిలీజ్ కానుంది. దాంతో ఈ సినిమా దాదాపుగా థియేటర్‌లు ఖాళీ చేయాల్సి వస్తుంది. కాగా తాజాగా ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీకి సంబంధించిన ఓ వార్త నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ సినిమా హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ దక్కించుకుంది. కాగా ఏప్రిల్ 14నుంచి ఈ సినిమా ముఖ్యమైన అన్ని భాషల్లోనూ స్ట్రీమింగ్ కాబోతున్నట్లు సమాచారం. అయితే ఇందులో నిజమెంతుందో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో కిచ్చా సుదీప్ కీలకపాత్ర పోషించాడు. శ్రియా శరన్ హీరోయిన్‌గా నటించింది.

మలయాళ హాస్యనటుడు ఇన్నోసెంట్ మృతి

హైదరాబాద్: ప్రముఖ మలయాళ హాస్యనటుడు ఇన్నోసెంట్ మరణించారు. కోవిడ్ సంబంధిత సమస్యతో గత కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడటంతో కన్ను మూశారు. ఆయన మరణంతో మలయాళ సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇన్నోసెంట్ కేవలం నటుడుగానే కాకుండా నిర్మాతగా, రచయితగా, గాయకుడిగానూ తన ప్రతిభతో బహుముఖ ప్రజ్ఞాశాలిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 'నృతశాల' సినిమాతో సినీరంగంలోకి ఎంట్రీ ఇచ్చిన ఇన్నోసెంట్ ఇప్పటివరకు దాదాపు 750సినిమాల్లో నటించారు. 'మజావిల్ కావడి జాతకం', 'పథం నిలయిలే తీవండి', 'రావణప్రభు', 'వేషం', 'స్నేహవీడు', 'మనసిన్నక్కరే'తో పాటు పలు మలయాళ సినిమాల్లో తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులకు అలరించాడు. గతేడాది పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'కడువా' సినిమాలో కనిపించాడు. ఇక ప్రస్తుతం ఆయన నటించిన 'పచ్చువుమ్ అద్భుతవిలక్కుమ్' విడుదలకు సిద్ధంగా ఉంది. ఇన్నోసెంట్ 2014 ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా చాలకూడి నియోజకవర్గం నుంచి ఎంపీ స్థానానికి పోటీ చేసి గెలుపొందారు. అయితే 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఇన్నోసెంట్ మృతిపై రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

ఓబులేసు పిలుపు

విశాలాంధ్ర-చిలకలూరిపేట: కార్మికులు, ఉద్యో గుల సమస్యల సాధన కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు పిలుపు నిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం సీపీఐ, ఏఐటీయూసీ, గ్రామ వార్డు సచివాలయం హెల్త్ సెక్రెటరీస్ ఉద్యోగుల సంఘం నాయకులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. గ్రామ వార్డు సచివాలయం హెల్త్ సెక్రెటరీస్, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంల సమస్యలపై చిలకలూరిపేటలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికి వినతి పత్రం అందించటానికి వచ్చిన ఓబులేసు మంత్రి రజిని అందుబాటులో లేకపోవటంతో రాష్ట్ర సచివాలయ ఉన్నత అధికారులను కలసి సమస్యలపై చర్చించారు. అనంతరం ఓబులేసు విలేకరులతో మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, ఉద్యోగుల శ్రమను దోచుకుంటున్నాయని, హక్కులను హరించి వేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న ఆశావర్కర్లు, మధ్యాహ్నభోజన పథక నిర్వాహకులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులకు కనీస వేతనం అందటంలేదని, సుప్రీం కోర్టు ఆదేశించినా సమాన పని కల్పించటం లేదన్నారు. ఈ నెల 28వ తేదీ దిల్లీలో స్కీమ్ వర్కర్ల సమస్యలపై ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో అన్నీ ప్రాంతాలలో స్కీమ్ వర్కర్ల సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు అందించామని గుర్తు చేశారు. ఏప్రిల్ 8,9తేదీల్లో ఏఐటీయూసీ వర్కింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారని, ఆ సమావేశాల్లో కార్మిక, ఉద్యోగుల సమస్యలపై చర్చించి, భావసారుప్యం గల కార్మిక సంఘాలతో కలసి ఐక్య పోరాటాలకు సిద్ధమౌతామని వెల్లడించారు.

ఏఎన్ఎంలు, హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలి ...

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డ్ సచివాలయాలలో ఏఎన్ఎంలు, హెల్త్ సెక్రటరీలు దాదాపు 13,000 మంది పని చేస్తున్నారని, తమ పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు వినతి పత్రాలు అందించటం జరిగిందన్నారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైందన్నారు. సచివాలయంలో పనిచేసే గ్రేడ్ - 3 హెల్త్ సెక్రటరీస్ అంద రికి 3సంవత్సరాలు పూర్తి అయ్యి ఏపీపీఎస్‌సి నిర్వహించిన డిపార్ట్మెంట్ టెస్టు ఉత్తీర్ణులయ్యారని, వారికి రెండు సంవత్సరాలు గడిచి నప్పటికీ ఎస్ ఆర్ రూల్స్ ప్రకారం ప్రమోషన్ చానల్ క్రింద ఇచ్చిన ఎంపీహెచ్ఎ(ఎఫ్)(గ్రేడ్-2). మార్పు చేస్తూ జీవో విడుదల చేయాలని, గ్రేడ్-2 కి వర్తించే అన్ని అలవెన్సులు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ సెక్రెటరీస్ కు 11వ పి ఆర్ సి ఇంతవరకు అమలు నోచుకోలేదని, వారికి తక్షణమే 11 వ పీఆర్‌సీఅమలు జరిపి ఎరియర్స్ చెల్లించాలని కోరారు. సచివాలయ హెల్త్ సెక్రటరీలకు 56 యాప్‌ల్లో సమాచారం అప్‌లోడ్ చేయటం ఇబ్బందిగా ఉందని, ఇందువల్ల వారు మానసిక ఒత్తిడికి గురి అవుతున్నారని ఓబులేసు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య పథకాల అమలులో ముఖ్య పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, గ్రామ వార్డు సచివాలయం హెల్త్ సెక్రెటరీస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పి. లీలావతి, నాయకులు సాంబశివరావు, ఆరాధ్యుల రామకృష్ణ, భగత్‌సింగ్, సాంబశివరావు, హెల్త్ సెక్రెటరీస్ ఉద్యోగుల సంఘం నాయకులు యాస్మిన్, వి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

కేకేఆర్ కెప్టెన్ నితీశ్ రానా

ముంబై: ఐపీఎల్ 16వ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టుకు నితీశ్ రానా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ మేరకు జట్టు యాజమాన్యం అతడికి బాధ్యతలు అప్పగించింది. శ్రేయస్ అయ్యర్ గాయం నుంచి కోలుకోక పోడంతో ఈ లెఫ్ట్ హ్యాండర్ 16వ సీజన్‌లో కేకేఆర్‌కు సారథ్యం వహించనున్నాడు. కోల్‌కతా కొత్త కెప్టెన్ రేసులో ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్, విండీస్ మిస్టరీ స్పిన్నర్ సునీల్ నరైన్‌తో పాటు విధ్వంసక ఆటగాడు ఆండ్రూ రస్సెల్ పేర్లు వినిపించాయి. అయితే.. ఆఖరికి నిలకడగా రాణిస్తున్న రానా వైపే యాజమాన్యం మొగ్గు చూపింది. 'శ్రేయస్ అయ్యర్ త్వరగా కోలుకొని ఐపీఎల్ 2023లో కొన్ని మ్యాచ్‌లైనా ఆడతాడని ఆశిస్తున్నాం. నితీశ్ కెప్టెన్‌గా జట్టును సమర్థంగా నడిపిస్తాడని భావిస్తున్నాం. ఈ లీగ్‌లో అతడికి చాలా అనుభవం ఉంది. అతను తన బాధ్యతను గొప్పగా నిర్వహిస్తాడనే నమ్మకం మాకుంది' అని కోల్‌కతా ఫ్రాంఛైజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. నితీశ్ రానా 2018 నుంచి కేకేఆర్‌తో కొనసాగుతున్నాడు. గత ఐదు సీజన్లలో 300లకు పైగా పరుగులు సాధించి నిలకడైన ఆటతీరు ప్రదర్శిస్తున్నాడు. దేశవాళీ టోర్నమెంట్లలో దిల్లీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం కూడా రానాకు ఉంది. గౌతం గంభీర్ కెప్టెన్సీలో కోల్‌కతా ఐపీఎల్ చాంపియన్‌గా అవతరించింది. అయితే.. 2017 తర్వాత ఆ జట్టు ప్రదర్శన ఆకట్టుకోలేదు. గత సీజన్‌లో అయ్యర్ కెప్టెన్సీలోనూ కోల్‌కతా విఫలమైంది. అందుకని ఈసారి ఎలాగైనా కప్పు కొట్టాలనే పట్టుదలతో ఉంది.

ఆర్సీబీ కొత్త జెర్సీ విడుదల

బెంగళూరు: పదహారో సీజన్ ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజ్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు కొత్త జెర్సీతో ఆడనుంది. జట్టు యాజమాన్యం... చిన్నస్వామి స్టేడియంలో కొత్త జెర్సీని విడుదల చేసింది. ఆ జట్టు స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ, కెప్టెన్ ఫాఫ్ డూప్లెసిస్ న్యూ జెర్సీని ప్రారంభించారు. దీనిలో ప్రత్యేకత ఏంటంటే.. బంగారు రంగులో లోగో ఉంది. మిగతా డిజైన్, కలర్ అంతా మునుపటి జెర్సీ మాదిరిగానే ఉంది. ఈ సందర్భంగా మాజీ విధ్వంసక ఆటగాళ్ల క్రిస్ గేల్ (17), ఏబీ డివిల్లియర్స్(333) జెర్సీలకు రిటైర్‌మెంట్ ప్రకటించారు. దాంతో తమ జెర్సీలపై గేల్, డివిల్లియర్స్ సంతకాలు చేశారు. ఈ లెజెండరీ క్రికెటర్స్‌కు ఆర్సీబీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. అంతేకాదు తమ జట్టుకు సేవలందించినందుకు వీళ్లకు గార్డ్ ఆఫ్ హానర్‌తో గౌరవించింది. ఈ సందర్భంగా 'మళ్లీ ఆర్సీబీకి ఆడతారా?' అని వీళ్లను సరదాగా అడిగారు. అందుకు గేల్.. 'నేను సిద్ధంగా ఉన్నాను అని చెప్పాడు. డివిల్లియర్స్ మాత్రం 'ప్రస్తుతం టీమ్ చాలా బాగా ఉంది. ఈ టైమ్‌లో మేము జట్టులో సరిపోతామని అనుకోవడం లేదు' అని తెలివిగా బదులిచ్చాడు. పదహారో సీజన్ ఐపీఎల్ మార్చి 31న ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో గత సీజన్ చాంపియన్ గుజరాత్ టైటన్స్, నాలుగు సార్లు విజేత చెన్నై సూపర్ కింగ్స్ ఎదురుపడనున్నాయి. ఆర్సీబీ జట్టు ఏప్రిల్ 2న ముంబై ఇండియన్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.